CNPROIA 410

గంగినేని వెంకటేశ్వరరావు

ఉదయిని

OI

ఉదయిని

★

కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామస్తులు
చిగురుపాటి బుచ్చిరామయ్య గారు
డా॥ చంద్రశేఖర్ గారు
బహూకరించిన పుస్తకం

కృతజ్ఞత:

అడగంగానే అప్యాయతతో ఆరు వర్ణ చిత్రాలు
వ్రాసి యిచ్చిన సుప్రసిద్ధ భారత విప్లవ
చిత్రకారుడు **చిత్తప్రసాద్ కు—**

(మొందటి టైటిలు, చివరి టైటిలు, అరణ్యపర్వం,
యుద్ధ పర్వం, శాంతి పర్వం. — చిత్రాలు
రచించింది చిత్తప్రసాద్)

గంగినేని వెంకటేశ్వరరావు

ఉదయిని

★

ప్రచురణ:
ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం

111

ప్రచురణ : అక్టోబరు 1950

★

సెలక్షను :
అనిసెట్టి సుబ్బారావు

★

వర్ణచిత్రరచన : చిత్తప్రసాద్
సమర్పణ : శంకర్
టైటిలు అక్షరాలు : సుబ్బారావు
చిన్న చిత్రాలు : న్యూమాసెన్., ఒక ప్రముఖ అమెరికన్ ఆర్టిస్టు

894.8271
ఎం. K0 - 6
8888

★

వెల :
రూ పా యి న్న ర

జనరల్ ప్రింటర్సు, గుంటూరు

14

ఆముఖమ్

శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు

ప్రజలు తమ జాతీయ విముక్తి కొరకు సాగించే మహోద్యమంలో పడే బాధలు, వాటిని అధిగమించడానికి చేసే త్యాగాలు అద్భుతమైనవి. ఈ వాస్తవిక విషయాలకు—కవుల ఊహాలు గాని, కాల్పనిక గాథలు గాని ఎన్నడూ సాటిరావు.

నైజాం నవాబులు బ్రిటీషు సామ్రాజ్యవాదులకు తలవొంచి ఆంధ్రదేశాన్ని ముక్కచెక్కలు చేశారు. కోస్తా జిల్లాలు లార్డు క్లైవుకు జాగీరుగా ధారాదత్తం చేశారు. దత్తమండలాలను, సైనిక ఖర్చుల కనే పేరుతో బ్రిటీషు వాళ్ళకు దఖలచేశారు. తెలంగాణా ప్రజలను గత రెండుశతాబ్దాలుగా నానాహింసలు పెట్టారు.

జాగీర్దారీ, జమిందారీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగము గత ఆరేండ్లుగా వీరోచిత పోరాటం సాగించుతోంది. రజాకార్ దుండగీడులకు, వారి పోషకుడైన నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రజానీకం జాతీయ విముక్తి కొరకు ఎనలేని త్యాగాలు చేసింది. వేలకొలది వీరులు రక్తాన్ని ధారబోసి పోరాడారు.

ఈ మహోద్యమానికి అండగా ఆంధ్రదేశమంతా నిలబడింది. 1948 నాటికి నైజాం అధికారాన్ని కూలదోసి, ఆంధ్రజాతి సమైక్యమై 'విశాలాంధ్ర' ను స్థాపించుకోవాలనే జాతీయవాంఛ సఫలీకృత మవుతుందనే ఆశ, కనుచూపుమేరలో కనిపించసాగింది.

అలాంటి సమయంలో కాంగ్రెసు ప్రభుత్వం 'పోలీసు చర్య' అనే పేరుతో సైన్యాలను పంపి నైజాం నవాబు రక్షణకు, తెలంగాణా ప్రజలను అణచివేయడానికి పూనుకుంది. ఇటు తెలంగాణాకు అండగా నిలబడిన ఆంధ్రజిల్లాలలోని ప్రజానీకంపై హింసాకాండను అమలు జరిపింది. 10 వేలకుపైగా తెలుగు గ్రామాలపై దాడులు చేసి లక్షలకొలది స్త్రీ పురుషులను హింసించారు. వేల కొలదీ ప్రజాసేవకుల ప్రాణాలు తీశారు. వేలకొలదీ తెలుగు తల్లులను, ఆడపడుచులను అవమానించారు.

నైజాం-కాంగ్రెసు హింసాకాండను ఎదిరించుతూ అజ్ఞాత వీరులెందరో తమ ప్రాణాలర్పించారు. ప్రజల త్యాగాలతో, వీరుల రక్తంతో నవ్యాంధ్ర జాతి చరిత్ర నిర్మించబడుతోంది. ఆవిధంగా గత ఐదారేండ్ల ఆంధ్రదేశ చరిత్ర-ఆంధ్రజాతీయ విముక్తి మహోద్యమంలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన ఘట్టం.

శ్రీ గంగినేని వెంకటేశ్వర రావుగారు ఈ మహోద్యమ ఆటుపోట్లకు గురియైనవారిలో ఒకరు. పోలీసుక్యాంపు చిత్రహింసలను అనుభవించారు. పోరాటంలో ప్రాణాలర్పించిన వీరుల గాథలు వారి హృదయంలో అనుభూతిని కలిగించాయి. ఆంధ్ర జాతీయాభిమానిలో వుండే ఆవేశం, యువ రచయితలో వుండే ఉద్రేకం వారిగీతాలలో ప్రస్ఫుటంగా కన్పించుతోంది. 'ఉదయిని' కావ్యంలోని వివిధపర్వాలలో జాతీయవిముక్తి మహోద్యమంలో తమ త్యాగాలద్వారా నవ్యాంధ్రజాతి చరిత్రను నిర్మించుతున్న ఆంధ్రవీరుల, వీరవనితలగాథలను, ఘట్టాలను అభివర్ణించడానికి రచయిత కృషిచేశారు.

I

ఈ కావ్యంలో మూడు పర్వాలున్నాయి. మొదటిదైన అరణ్యపర్వాన్ని 'వెలుగునీడలు' అనేగీతంతో ఇలా ప్రారంభించారు :

" ఎర్రనైన తూరుపుకొండలు
రంగుల దిద్దిన దివ్వెచేల
ఎర్రపూలతో? "

అని ప్రశ్నించారు. ఆంధ్రదేశ పరిస్థితులను ఎలా వర్ణించారో చూడండి!

"సలసల పొంగులువారే కృష్ణాగోదావరు
లే తల్లుల భగ్నజీవిత దుఃఖ
నదీ నదాలు?"

" ఎర్రగా బీటలువారిన పొలాలు
సున్నిపొట్టకు రొమ్ములు పగిలిన
ఏ తెలుగు గ్రామ సంకేతం? "

" పూలతోటవంటి నిండు పల్లెలు
చితక తొక్కినదె కర్కోటకుల
ఇనుప పాదాలు? "

ఈ విధంగా ఆంధ్రదేశస్థితిని వర్ణించి, రచయిత 'మూడునేత్రాలు' అనే పాటలో ఇలా ప్రశ్నించుతారు!

" ఇంతేనా బ్రతుకంతాను
ఇంతేనా భవితంతాను
లేశమైన మంచె లేదా? "

అని తానే యిలా సమాధానం చెబుతారు :

" నిస్సారం కాదు బ్రతుకు, నిరాశ కాదు ఆశ
నిష్ఫలం కాదు జీవితం, వినాశం కాదు లోకం
ముందుముందు మృత్యువు రాదు,

ముందు ముందు దాస్యంలేదు
పోరాటం తప్పదుకాని, ఓటమిలేదింక మనకు!"

'తల్లి తనయునికి' అనే గీతంలో మిలిటరీ ఆక్రమణలో వున్న గ్రామంలో నివసించుతున్నతల్లి, ప్రతిఘటనోద్యమంలో వున్న కుమారునికి వ్రాసిన జాబులో తానూ, తన కోడలు పడుతున్న ఇడుమలను గురించి చెబుతుంది.

"కాళ్లు కళ్లులేని నాకు మంచినీళ్ళిచ్చే దిక్కులేదు
ఇల్లు పోలీసుల కప్పజెప్పి పరులపంచల్లో పడివుంటున్నా
ఏడ్చే ఓపికకూడ లేక బూడిదముద్దలాగున్నా
గడ్డకట్టిన కాసారాలలా వున్నకనుగుడ్లవెంట నీళ్ళురావు!
కాని నా నిమిత్తం అరనిమిషం విప్లవమార్గం తప్పవద్దు!
నేనుపోతే భయపడవద్దు, వాళ్ళసమాధిమీద నాసమాధి
కట్టించు తండ్రీ!"

అని తల్లి కోరుతుంది. ఒకరోజు రాత్రి ప్రొద్దుగూకే వేళ 'వాళ్లు' ఇంటిమీదపడి,"కోడల్ని ఎక్కడికో యీడ్చుకెళ్లారని" తెలుపుతుంది.

"సీతాదేవివంటి నాకోడలు దిక్కులేని చావుచచ్చి బీటిలోపడివుంటే
కాకులుగద్దలు పీక్కుతింటూంటే ఆ కళేబరంమీదపడి నిలువెల్లా
నీరయ్యాను!
నెలపొడుపునాడు పురుగుకంటె హీనంగా చనిపోయింది నాయనా!"

అంటుంది. ఈ పాదాలు హృదయాన్ని కలచివేస్తున్నా యిగదా!

II

'యుద్ధపర్వం 'నీలిమంటలు' అనే గేయంతో ప్రారంభమవుతుంది 'తెలంగాణా' అనే గీతంలో రచయిత తెలుగుతల్లి నిలా సంభోదిస్తారు :—

"ఎందుకు అమ్మా ! కంట తడిపెట్టావు?
ముక్కోటి సంతతి ఉన్నామే!
షట్కోటి హస్తాలున్నాయే!"
"ఎవరమ్మా నిను పరాభవించింది?
ముక్తిని సాధించే నీ బిడ్డలున్నారే!
రక్తరంజిత పతాక రెపరెపలాడుతుందే!"

అని హామీయిస్తారు తల్లికి. 'గెరిల్లాలతో ఒక నిమిషం' అనేపాట గెరిల్లా వీరులయెడ ప్రజానీకాని కున్న అభిమానాన్ని వ్యక్తపరుస్తుంది.

"మీకోసం చెట్టుకొక్క
పువ్వుకోసి మాలగుచ్చాను!
లక్షభాషా సంద్రాలు తరచి
శతకోటి పాటలల్లాను!"

అని చెప్పుకొంటారు.

"వీరమాతా పితలు పంపిన రక్తగంధం పట్టుకొచ్చాను
అందిన ఆచూకీ, పొందిన అనుభూతి కనురెప్పలో దాచితెచ్చాను"

అని ఆప్యాయతతో క్షేమసమాచారం అందజేస్తారు.

'అరిచేతిలో మృత్యువు' అనే గీతంలో గెరిల్లా నాయకుడు తన దళాన్ని సుశిక్షణతో నడిపే విధానం, కష్టాలను అధిగమించి దీక్షతో కర్తవ్యాన్ని నెరవేర్చడాన్నీ చక్కగా చిత్రించారు.

'శిక్షాపత్రం' అనే గీతంలో ప్రజలకు ద్రోహియెడల సహజంగా వుండే కోపాన్ని వ్యక్తపరచారు.

'బహిరంగలేఖ ii' అనే గేయం శత్రువుల నెదిరించి పోరాడుతున్న ప్రజాసైనికులకు పేరు పేరున గ్రామంలోవున్న ప్రజల

షేను సమాచారాలను తెలుపుతుంది. దీనిలో గ్రామ జీవితంలో వస్తున్న మార్పులు, కుటుంబాలు అనుభవించుతున్న కష్టాలు హృదయానికి హత్తేలాగ చిత్రించబడ్డాయి.

III

శాంతిపర్వంలో 'చైనా'; 'శాంతిగీతం'; 'అమ్మా'; 'జేబీ' అనే గీతాలున్నాయి.

" మాసిపోయిన మా చరిత్రలు
నీతికి గనులై వెలిశాయా?
చెదిరిన ఆశాలతలు
తీగసాగి అల్లుకున్నాయా? "
"జనచైనా! జగదభివందనాలివిగో చైనా!
నీ స్వేదంతో వెలిగే చైతన్య జ్వాలలం!
కళ్లారా చూడు, నీ అనుగు తమ్ములం ! "

అంటూ చైనా ప్రజావిజయాన్ని కీర్తించుతారు.

మరోయుద్ధాన్ని తెచ్చేందుకు కుట్రపన్నుతున్న సామ్రాజ్యవాదుల ఆటకట్టించి, సుస్థిరమైన శాంతిని స్థాపించాలనే ప్రపంచ ప్రజాభీష్టాన్ని శాంతి గీతంలో రచయిత చక్కగా చిత్రించారు.

IV

ఈ కావ్యంలో రచయిత ఆంధ్రప్రజల జాతీయ విముక్తి మహోద్యమంలోని ఘట్టాలను, గాథలను చిత్రించడానికి ప్రయత్నించారు. ఎంతవరకు సఫలీకృతులయ్యారో నిర్ణయించాల్సింది ఆంధ్రమహాజనులు.

ఇలాంటి కావ్యాలు అనేకం రచించడానికి 'ఉదయిని' ఆంధ్రరచయితలకు ఉత్సాహం కలిగించుతుందని ఆశించుతున్నాను.

ప్రతిఘటనోద్యమంలో పాల్గొన్న ప్రాంతాలను, ప్రజలను దర్శించి ప్రజాజీవితాన్ని, వీరుల చరిత్రను చిత్రించుతూ కావ్యాలు, కథలు, నవలలు వ్రాయడానికి తెలుగు రచయితలందరూ కృషిచేయాలని కోరుతున్నాను.

'ఉదయిని' కృతికర్త శ్రీ గంగినేని వెంకటేశ్వరరావు గారు ద్విగుణీకృతోత్సాహంతో ఆంధ్రసాహిత్య సేవకు పూనుకుంటారని ఆశించుతున్నాను. ఇవే యువరచయితకు నా ఆశీస్సులు! అభినందనాలు !!!

★

ప్రథమ దర్శనం : వేయి పడగలు

అన్ని హక్కులు : 'గంగినేని' వి



ప్రతులకు :

ప్రజాశక్తి కార్యాలయం

గవర్నరు పేట

విజయవాడ.

★

XII

ఈ నాటికీ "ఉదయిని" !

విప్లవాంధ్రను, విశాలాంధ్రను "ఉదయిని"ని సమర్పించటానికి ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం గర్వపడుతున్నది. చారిత్రకమైన వివిధ దశల్లో విజృంభించిన ప్రజోద్యమంలా వెల్లివిరిసిన ఈ కవితా సంపుటి ఒక్కసారి హఠాత్తుగా సృష్టింపబడింది కాదు; ఎక్కడో జారిన కన్నీరు, పారిన నెత్తురు — విషాదమేఘం వెనక విచ్చిన కాంతులకత్తుల — ఈ చావుకూ జీవితానికీ నడిమి కర్కశమార్గం వెంట ప్రయాణం కట్టిన బాటసారి అప్పటప్పటి ఆవేశాలకు కల్పించిన కళారూపమే ఈ కావ్య సంపుటి.

ఇక్కడ నిత్యం పొంగే దుఃఖం, చిందే రక్తం. చితికే జీవితం — ఎక్కడో తూరుపు కొండల్లో ఎర్రని తూర్పు, వికసించిన ప్రాణం — ఇదే మన తెలుగు నాటి జీవనమూ, భావనా! దీనికి కవి 'గంగినేని' సాక్షి మాత్రుడు కాడు; భాగస్వామి! ఆయన రసహృదయంలో తరగెత్తిన అనుభూతులు — కన్నీరూ, క్రొన్నెత్తురూ కలిసిన కావ్యంగా — మూర్తిభవించాయి! ఆంధ్రజాతి ఆత్మ ఆయన హృదయంలో ప్రతిఫలించి, జాతిజీవితంలోని ఒక విప్లవోజ్జ్వల విషాద గీతగాథ ఆయన కావ్యవస్తువై, ఆంధ్ర ప్రజల జాతీయజీవితానికి తీర్చి దిద్దిన కళామూర్తిగా "ఉదయిని" అవతరించింది!

అభ్యుదయ రచయితగా, ప్రజానాయకుడుగా ముందంజవేసి ప్రజోద్యమ సంరంభంలో కవి హృదయంతో శ్రీ గంగినేని వెంకటేశ్వరరావుగారు (1948-50 లలో) వ్రాసిన గీతావళిని "ఉదయిని" రూపంలో ఈ నాటికి సంపుటీకరించగలిగినందుకు సంతోషం! ఈ కావ్య సంపుటిని సమగ్రంగా పరిశీలించి, విప్లవాంధ్రను "ఆముఖమ్" రచించిన ప్రజానాయకులు, సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు అయిన శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు గారికి మా అభివందనాలు! ఈ గీతావళిలో కొన్నిటిని ఈ వరకే ప్రచురించి ఆంధ్రలోకానికి పరిచయం చేసిన "అభ్యుదయ", "విశాలాంధ్ర", "సంధ్య", "జనవాణి" ఇత్యాది ఉత్తమ పత్రికలకు మా కృతజ్ఞత! భారతాకాశంలో విప్లవకాంతులు విరిసిన విశాలాంధ్ర "ఉదయిని"ని హృదయానికి హత్తుకొంటుందని మా విశ్వాసం!

మీ,

—ప్రయాగ

10-10-'50

[ఎప్పుడో "ఉదయిని" వెలువరించాలనుకున్నాం. కాని ఆర్థిక రాజకీయ నిర్బంధాలు కారణంగా ఆలస్యం అనివార్యమయింది. ఈ నాటికి "ఉదయిని" వేయి పడగలు విప్పుతూ కావ్యధాత్రికి జీవగర్ర అవుతున్నది. దీనికి ఆంధ్ర మహాజనుల ఆదరం లభిస్తుందని నమ్ముతున్నాం. — ప్రకాశకులు]

సూచిక:

అరణ్య పర్వం

వెలుగునీడలు

ఎర్రసముద్రం

ఓ రాత్రీ!

ఎరుపు

మూడునేత్రాలు

ప్రియుడు ప్రియురాలికి

తల్లి తనయునికి

యుద్ధ పర్వం

నీలిమంటలు

పాలిపాట

తెలంగాణా!

గెరిల్లాలతో ఒక నిముషం

బహిరంగ లేఖ i

అరిచేతిలో మృత్యువు

శిక్షాపత్రము

నిజంలో నిజం

బహిరంగలేఖ ii

శాంతి పర్వం

చైనా!

శాంతి గీతం

బేబీ!

అమ్మా!

★



సమర్పణ :

రక్తం ఒలికించడం కంటె బాధయింది
ప్రాణం త్యజించడం కంటె విలువయింది భువిలేదు
అనామకంగా, అమాయకంగా అడవులలో
ఆత్మార్పణచేసిన విశాలాంధ్ర వీరులార!
అజ్ఞాతంగా నిహతులైన సహోదరులార!
మీ గౌరవచిహ్నంగా మీ కాళ్ళముందు తలదించుతున్నా!
మీ స్మృతిచిహ్నంగా మీ చేతుల్లో 'ఉదయిని' ఉంచుతున్నా!



అరణ్య పర్వము

XVII



[illegible]

XVIII

వెలుగునీడలు

శుక్లపక్షం :

ఎర్రనైన తూరుపు కొండలు
రంగులు తీర్చిన దెన్నిచేల
ఎర్రపూలతో ?

పుచ్చపువ్వువంటి వెన్నెలతోనేకే
ఆకాశరాణికి జీవనహాసం తొడిగిన
దేమహాత్ములు ?

కాటుక చీకటి నేత్రం కడిగిన
కన్నీటి సముద్రాలొలికిన
దేమహాత్యాగులు ?

సలసల పొంగులువారే కృష్ణాగోదావరు
లే తల్లుల భగ్నజీవిత దుఃఖ
నదీనదాలు ?

శోకభారంతో రాలిననక్షత్రం
అమానుష చిత్రహింసకు కూలిన
ఏ వీరుని స్మృతిచిహ్నం ?

తల్లిగర్భంలో కెవ్వున కేకవేసి
చనిపోయిన పసికందుకు హేతువు
ఏరాక్షసుడో ?

కారుమేఘ సంఘర్షణ వెడలే పిడుగుల వర్షం
ఏతాణావధ్య శిలపై చితికే లేతప్రాణి
తీవ్ర ప్రతి ధ్వానం?

సమ సమాజ సంస్థాపనార్థం, కానని కారడవులలో
దుస్సహకష్టాలు తోడునీడలుగా అజ్ఞాతవాసం చేసే
అశేష పాండవు లెవరు?

నిప్పులు చెరుగుతున్న ఎర్రనిఎండ—
పరాభవం పదేపదే దాడిచేసిన ఏ ఆంధ్రవనిత
మహోధృత క్రోధనేత్రం?

కన్నీరు మున్నీరుగా వాపోయే నభోమండలం—
కళ్ళగంతలు కట్టి, నిరాయుధ మానవోత్తముల
గుండెలు పేల్చే ఏదృశ్యానికి సాక్ష్యం?

ఎర్రగా బీటలువారిన పొలాలు
సున్నిపోట్లకు రొమ్ములు పగిలిన
ఏ తెలుగు గ్రామ సంకేతం?

వెయ్యిపుట్ల జ్వరంతో వేగుతున్న నా ఆత్మ
ప్రమాదం ముట్టడించిన ఏ ఎర్రసైనికుని
కంపిత హృది జ్ఞాపకార్థం?

రావణాసురుడి కాష్టంలా మండుతున్న
పోలీసుటోపీ గుట్టల నాలుకలే గెరిల్లాల
ప్రతీకార పతాకాలు?

కృష్ణపక్షం :

పూలతోటవంటి నిండు పల్లెలు
చితకతొక్కిన దే కర్కోటకుల
ఇనుప పాదాలు ?

అడవిలో చెట్టుకైన ఆధారం ఉందిగాని
నడివీధిలో పొట్టచేత బట్టుకున్న—
ఈ నిర్భాగ్యుడికి నీడలే దెందుకు ?

పదిడబ్బుల కాశపడి అపరిచితుణ్ణి
హత్యచేయను పూనుకున్న వ్యక్తి
ఏపాలక జాతి వారసుడు ?

జైళ్లల్లో రాజకీయ ఖైదీలను
తుపాకులతో వేటాడే ప్రభుత్వం—
ఏ నీతికి ప్రవక్త ?

రక్త సంబంధాలలోనే, ఒకరినిచూస్తే
ఒకరికి అసూయ, ద్వేషం, దురాశ—
ఏ సమాజం దీనికి కారణం ?

తల్లి ఒళ్లో బిడ్డలను తీసికెళ్లి
చిట్టడవులలో కాల్చిచంపిన
దే నిరంకుశ ప్రభుత్వం ?

గట్లదగ్గర పోట్లాటలో ఒకరి ప్రాణాలు
ఒకరు తీయను సిద్ధమయిన అన్నదమ్ములు—
ఏ సమాజ విషపరిణామ సంకేతాలు ?

హిమవత్పర్వతా లలా పవిత్ర మహోన్నతులైన—
స్త్రీపురుషులను పట్టపగలునగ్నంగా బజార్లలో త్రిప్పి
చెప్పరాని హింసలు పెట్టినదే అమానుష రాజనీతి?

అవని అంతటా, అడుగడుగునా ప్రత్యక్షమయ్యే
ఆగర్భదరిద్రులు, బిచ్చగాళ్ల గుంపులు
ఏవర్గ సమాజ సహస్రనేత్రాలు ?

కన్నబిడ్డలను చేతులారగోతిలో త్రోసి
ఆత్మహత్య కొడిగట్టిన అనుగుతల్లి హృదయం—
ఏ వ్యవస్థ నిర్దాక్షిణ్యంగా పెరికి నెమరేసింది ?

ఆకలితో తల్లడిల్లి కళ్లుమూసిన
రోడ్డుపక్క దిక్కులేని కళేబరాలు
ఏ వ్యవస్థ ప్రతిబింబాలు ?

వేకువ :

చీకటి విలవిల లాడెను
తూరుపు తెలతెలవారెను
ఆత్మార్పణచేసిన వీరులువచ్చారు!
అధికారాన్ని విచారించారు!

చీకటినీ, దోపిడినీ, ఖైదీలుగ
వధ్యశిలకు సంకెళ్ళతో తెచ్చారా!
పాలకులను, పీడకులను ఈడ్చుక వచ్చారా!

అరదండాలతో అశాంతినీ, అన్యాయాన్నీ
బలిపీఠం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తున్నారా!
సింహాసనం, కిరీటం, శాశ్వతంగా నిర్మూలిస్తారా!

★

2

ఎర్రసముద్రం

అర్ధరాత్రి కలవరిస్తోంది !
పురిటిపాప పసికోరిక
బూడిదను స్పర్శిస్తోంది !

గూళ్ళువీడి గుడ్లగూబలు
భయాలని చేతబట్టుకొని
తమిస్రాలపై సంచరిస్తున్నాయి !

కాలికూలిన వృక్షాలలా
పడిఉన్న బిచ్చగాళ్ళ మధ్య
నవ్వుతూ మృత్యువు నర్తిస్తోంది !

వీధి మొగలో పచ్చిగాయంలా
నిలబడిన విషకన్య
క్రొంగ్రొత్త ద్వేషాలని వెలిగ్రక్కుతోంది !

నక్షత్రాలు నవ్వుతున్నాయి వెకిలిగా,
నిశ్శబ్దం నిట్టూర్చుతోంది వెలితిగా,
రాజుతున్న పగ పొగలా
రహస్యంగా వ్యాపిస్తోంది !

*   *   *

తరతరాల అనాథ, అభాగ్య
జీవితాలలో నిబిడమైన
ఖేదసముద్రం ఇంకిపోతోంది !

దినగండాలు సహించలేక
దరిద్ర మహాజనాళి
మండే రణజండా ఎత్తింది !

పరుల భారాలు మోయలేక
బానిసలు గుండెలు పిడికిట
ధరించి సమరం ప్రకటించారు !

ధరణీ గర్భంనిండిన
అశాంతి అగ్నిపర్వతంలా
ఖగ్గున బ్రద్దలయింది !

పృథ్వీవదనం కమ్మిన,
అజ్ఞానపు మంచుతెరలు
మెల్లగ విడిపోతున్నవి !

రేపటి విజయానికి సిద్ధంగా
మానవులు —
కొత్త నైతిక శాసనాలు
వ్రాస్తున్నారు !

నవచైతన్యం స్ఫురించి
బాహ్యాంతర లోకాలు చిగిర్చాయి !
ఎడదలూ, ఎడారులూ—
సుఖాలు పండుతున్నాయి !

ఓ రాత్రి!

కనికరించు,
కన్నుమూయకు,
ఓరాత్రి,
నీకెంతో కృతజ్ఞుణ్ణి!

ఈ గాఢాంధకార వృత్తంలో
విరిగిన మనోరథాలు
మూలపడితేనే
చాల సంతోషం!

ఆద్యంతరహిత తిమిరంలో
గతం గడ్డపలుగులతో
పొడిచినా బాధలేదు!

ఏకాంత నిశీథంలో
హృదంతర గాయాలొక్కొక్కటి
బాధతో కృశించనీయండి!

ఖిన్నంగా, సన్నంగా,
పరాభవిత ధరిశోకం—
వేకువ శ్లోకిస్తే వినలేను!

విషవార్తలతో ఉషస్సు
ఒళ్లువిరిచిలేస్తే
భయపడి పడిపోతా!

వధల గాథలతో
బరువుగా, బలంగా
నోరువిప్పే పత్రికలు
చదవను నోరురాదు!

దయా, ధర్మం
ఉరితీసే ఉదయం
ఒక్కనాటికైనా వద్దు!

హత్యలు, అబద్ధాల మధ్య
జూలువిప్పే తూరుపుకొండ
చూస్తే గుండె ఆగుతుంది!

పచ్చని నురుగులు కక్కే
పాములాంటి పగలు
నా కంటికి పడదు!

ప్రొద్దున్నే —
అన్యాయం, అమానుషం,
ప్రచురించే, ప్రచారంచేసే
పత్రికల ముఖం చూడలేను!

నెత్తుటి వరదపై
ప్రొద్దుపొడిస్తే, నడిస్తే
పాదరసంలా పాకితే
తనువు తల్లడిల్లదా!

పగలా, పులిపంజలా,
సాగే పదునైన ఎండ
పొడ నే భరించలేను!

దయచేసి
ఓ రాత్రీ,
కన్నుమూత
పడనీయవద్దు!

★

3

ఎరుపు

పాప ఎరుపు
కనుపాప ఎరుపు;
చెల్లి బొట్టు ఎరుపు
తల్లి ఫాలం ఎరుపు!

పండ్ల తోట ఎరుపు
బండ చాకి రెరుపు,
వెఱ్ఱి కేక ఎరుపు
నరుల ఆకలెరుపు!

కొత్త కోర్కె ఎరుపు
కొడవలంచు ఎరుపు
తుదిక్షణాలు ఎరుపు
తూర్పుకొండ ఎరుపు!

దుక్కిచాలు ఎరుపు
తెలుగుపూలు ఎరుపు
ఇంటిముంగి టెరుపు
ఎల్లలన్నీ ఎరుపు!

కోపం రూపం ఎరుపు
గుండెగాయం ఎరుపు
రక్తగాన మెరుపు!

నే నెత్తినజండా ఎరుపు!
నా
కావ్యరాశి ఎరుపు!
నా
స్వప్నస్వర్గం ఎరుపు!

★

మూడు నేత్రాలు

నిన్న :

ఇంతేనా బ్రతుకంతాను
ఇంతేనా భవితంతాను
లేశమైన మంచేలేదా ?
రవంతైన కాంతేరాదా ?

దారిద్ర్యపు ఒడిలో నిద్రించే బిడ్డా ! ఎవరు నీ తల్లిదండ్రులు ?
పుట్టెడుదుఃఖంలో పూడిన ఓచెల్లీ ! ఎందుకు ఈ దుర్గతి ?
ఆకలి కార్చిచ్చులోన హతమయ్యే తమ్ములార! విముక్తి లేదా ?
కష్టాల ఎడారిలో కనలేమానవులార ! వసంతమే ఎరుగరా ?

అవమానం, అన్యాయం, కులదేవతలా మనకు ?
దుర్మార్గం, దోపిడి, మనపై అధికారులా ?
అభిమానం, కారుణ్యం, మనకు రెండునేత్రాలై
వెలిగే సత్యాశయాలె మార్గదీప్తులా మనకు ?

అడుగులేని పాతాళం గడువలేనిదా ?
అంతులేని అగాధమె గట్టుదాటలేమా ?
ఒతుకులాడి పడిపోయే బ్రతుకుగోడ నిలువదా ?
త్రోవనిండ పెరిగిన ఈ అడవుల కంతం లేదా ?

ఏం చూసుక బ్రతుకుతాము
ఏం తింటూ బ్రతుకుతాము
ఈ బ్రతుకెందుకు, లోకం
బరువెందుకు మనపైన ?

ఎన్నాళ్లు కన్నీళ్లతో కడుపు నింపుకుంటాం
ఎందాక ఆశలబలిపీఠంపై ప్రాణాలు రాశిపోస్తాం
ఈ ఎడారి బ్రతుకులో కోరికలింకేం కోసుకుంటాం!
ఈ నిస్సార జీవితంలో ఎలా మంచిరోజులు విత్తుతాం!

చీకటి లోతుల్లో, లోయల్లో, పుట్టినమేం
ఆకటి గుండంలో, చాకిరికోరల్లో పెరిగిన మేం
రాక్షసలోకంలో, రావణరాజ్యంలో పెరుగుతున్న మేం
చీకటికీ, ఆకలికీ, ఏలికలకు ఆహుతియా?

పాలకుల ఇనుపపాదాల క్రింద పచ్చి వ్రణాలు మా శిరస్సులు,
కలవాళ్ల కత్తులబోనులో వెర్రిఊహలు మా తపస్సులు,
ప్రమాదాల కంకరతో బ్రతుకుబాట, భవితకోట! ఎలా?
క్షణక్షణం ఖైదులలో నిండుప్రాణ ప్రయాణాలు! ఎలా?

జీవనదులు గంగాగోదావరీలు ప్రవహించు మాకళ్లు
అప్పుడే ఎండి పోయా యేం!
కొండలు, పర్వతాలు పిండిగొట్టు మా కండలు
అదృశ్యమయ్యా యేం!
ఆశలు, ఆనందాలకోసం అర్రులుసాచిన మారోజులు
ముల్లులు చవిచూస్తున్నాయేం!
నిత్యం భవనాలు, భువనాలు సృష్టించిన మేమే
నీడలుగా, గతప్రాణుల జాడలుగా బ్రతకాలేం!!

ఇంతేనా బ్రతుకంతా, ఇంతేనా భవితంతా
చాకిరితో, బాధలతో చివికి చితకాల్సిందేనా
ఆకలితో, అవమానంతో, మా దీపం కొండెక్కుతుందా
ఆరని అగ్నితో, తీరని కోరికతో నడిఈడులో ఉడుగుతున్నాం

నేడు :

ఎంత చల్లనిరాత్రి! ఎంతచక్కని ధాత్రి!
నిండుపున్నమి నేడు, పండువెన్నెలరేయి!
పండి ఒరిగిన కాంక్ష, గుండెబరువున జగతి—
దారితీరంలేని కన్నీటి ఏటిలో కదులు మనజీవితం!

ఎక్కలేం ఏడుకొండలు, దాటలేం ఏడు సంద్రాలు
మోయలేం మోపెడు కష్టాలు, త్రాగలేం అశ్రుజలధులు
ఇంకా బ్రతుకు విరిచి తింటూ కలకాలం బ్రతకలేం
ఇంకా పరులకు జీవితాలు తరిగి పడవేయలేం

ఏడు నిలువుల లోతు ఖేదంలో, భేదంలో బ్రతుకు లాగలేం
గౌరీశిఖరంలా పెరిగిన ద్వేషం, రోషం జీర్ణించుకోలేం
భూదేవి వైశాల్యమంత ఆకలితో, అన్యాయంతో అడుగైనవేయలేం
మృత్యువులా బ్రతుకుచుట్టూ నిలిచిన తుపాకులతో జీవించలేం

ఎందుకలా వాళ్ల పీకలుకోసి కుప్పలుపోస్తారు
ఎందుకిలా వీళ్ళను క్యాంపుల్లో చిత్రహింస చేస్తారు
అలా వాళ్ళ గుండెలనిండా తుపాకిగుళ్ళు నింపుతారేం
ఇలా దుఃఖంలో మునిగే దరిద్రులపై స్వారిచేస్తారేం

మా స్వేదం పారిన పంటలు మీకా
మా కండలతొ ఎదిగిన మేడలు మీవా
మా నెత్తురు గ్రోలిన సౌందర్యం మీదా
మా ఎముకలు నమిలే ఫ్యాక్టరీలు మీవేనా

*   *   *

నిస్సారంకాదు బ్రతుకు, నిరాశకాదు ఆశ,
నిష్ఫలంకాదు జీవితం, వినాశంకాదు లోకం
ముందు ముందు మృత్యువురాదు, ముందు ముందుదాస్యంలేదు
పోరాటం తప్పదు కాని, ఓటమిలే దింక మనకు!

3] కోట గోడలెత్తిన మా కండలకు
బారు ఫిరంగు లెదురా?
జైలుగోడ కట్టిన మా రెక్కలకు
కారాగారా లడ్డా?
పుడమికి ఊపిరిపోసిన మా శక్తికి
ఎదురు శక్తి కలదా?
నేల కడుపు పంట మేము : పుట్టుకతో సైనికులం
ఎవరెదిరిస్తా రిప్పుడు?

ఎత్తండ్రా ప్రతీకార సంకల్పంతో ఎర్రబడ్డ హస్తాలు, సహస్ర సహస్రాలు
ఎత్తండ్రా పీడనతో అగ్నిగోళాలైన గుండెలు, శతరెండు కోట్లు
ఎగరేయండ్రా నిప్పుముద్దలు, ఉక్కుకొండలు శత్రు శిబిరాలమీద
ఎగరేయండ్రా పగశిఖరాలపై తిరుగుబాటు జండాలు, నేల ఈనినట్లు

ప్రతి మనిషీ అజేయశక్తియై మండే ఉక్కుపిడికి లెత్తాడు
అడుగడుగూ అగ్నిపర్వతమై రణానికి తరలుతోంది
పర్వతాలు, నదీనదాలు బారుగా హోరుగా సమరభూమి చేరుతున్నాయి
ప్రకృతి లక్షచేతులెత్తి ప్రళయాలు, విలయాలు శత్రువులపై కుమ్మరిస్తోంది

రేపు :
కొప్పునిండా తెల్లనిపూలు తురుముకో—రాత్రీ!
వంటినిండా చల్లని హర్షగంధం రాసుకో—పృథ్వీ!
కొరివివంటి ఎర్రని పిడికిలెత్తు—జనతా!
ఒకసారి గుండెలు బ్రద్దలయ్యే వెర్రినవ్వు నవ్వు—ఫ్యాక్టరీ!

ఆనందం విరిసిన ఆకాశపు పెదవులనుండి
పాలకాల్వలు జారుతున్నాయి!
మధుర మధుర ప్రాణాలు కుసుమించిన భూదేవినేడు
కమ్మని కలలు కంటోంది!

ఆవేశాలానందాలు పూచిన, కాచిన ప్రకృతి తల్లి ఆకుపచ్చ
పసుపు వంటికి పులుముకుంటోంది !
నవసమాజ హృదయంలో,నాళాలలో పారుతున్న శాంతి,సమత
స్వరమేళగా పాడుతున్నాయి !

వెళిపోదాం తల్లీ, వెళిపోదాం చెల్లీ, ఆనందనిషాలో హాయిగా
విరిసిన, మెరిసిన సౌందర్యపు పంటలలో విహరించను వెళిపోదాం !
వెళిపోదాం అన్నా, వెళిపోదాం వర్గరహిత భూస్వర్గంలోకి
ఆడుకోను, పాడుకోను నిండుగా దండిగా నివసించను వెళిపోదాం!

★ ★ ★

ప్రియుడు ప్రియురాలికి:

[కాలేజీ జీవితంలో ఒక విప్లవకారుడు, మరో విద్యార్థిని గాఢంగా ప్రేమించుకున్నారు. పెళ్ళి తేదీ పెద్దలు నిర్ణయించారు. ఇంతలో పాలపొంగులా పొంగే ప్రతిఘటనోద్యమంనుండి అతనికి పిలుపు వస్తుంది. ఆమెకు అతనితో వెళ్ళే విప్లవస్థాయి లేదు. కాని విప్లవాన్ని ఆమె ఆహ్వానిస్తుంది; అభినందిస్తుంది. పవిత్రతతో అతన్ని ఆరాధిస్తుంది. ఆమె ఓజాబుకు జవాబుగా అతను ఈ లేఖ వ్రాస్తాడు.]

అమ్మ, నాన్న, అన్నయ్య, అక్కాయి
నా మీద ఆశలకు తిలోదకాలొదిలినా,
రచ్చబండమీద చర్చలలో నా చరిత్ర
ప్రస్తావన అనుకోకుండా అస్తమించినా,
మీ చెల్లాయి బావమీద పాటలుపాడి
నిన్ను జివ్వుమనిపించటం మానినా,
నీవుమాత్రం తదేక దీక్షతో నా కోసం నిరీక్షించు!

నన్ను నిరాశచేసుకొని మీ వాళ్ళు మరొకర్ని
పెళ్లిచేయను ప్రయత్నించినా, బలవంతం చేసినా,
తోటి ఆడపిల్లలు దిగులుతో కుమిలే నిన్ను
నా మరణవార్తలు చెప్పి నిస్పృహలో పడద్రోసినా,
విలయవిరహరాత్రులు రాకసికోరలు విప్పి నిన్ను
చెప్పరాని యమయాతనలలో పుటం పెట్టినా,
నాకోసం, నారాకకోసం ఎదురుచూడటం మానేవు!

రోజురోజుకు సగమయ్యేట్లు నిన్ను కర్కోటక
దుఃఖం దిగమ్రాగుతోందని నాకుకూడ తెలుసు!
ఇవాళ నన్ను నీవు చూసినా, నిన్ను నేను చూసినా చప్పున
గుర్తించలేనంతగా మారిపోయామనుకుంటా!
నేను నిరంకుశప్రభుత్వ క్రూరమృగంతో పోరుతూ,
చిక్కిశల్యమవుతోంటే, నాకోసం తపించి, జితించి
పదిహేడేళ్ళ వయస్సులో నీ వస్తిపంజర మయ్యావు!

నన్ను రణరంగానికి ప్రేమతో నీవు సాగనంపినక్షణం—
జీవితంలో మరిచినా మరపురాని మహాకావ్య శీర్షిక!
ఆదర్శాన్ని పాటించి ఉత్సాహంతో వీడ్కోలిచ్చిన ఆ నిమిషం—
నీలో విజృంభించిన ఉప్పెన విశ్వరూపం నీముఖంలో చదివా!
చవితినాటి చంద్రుడు మనిద్దర్ని చీకటిలో ముంచాలనుకున్నా,
అరమైలుదూరం నడిచిందాకా, ఆ కీ వెన్నెలలో ఏకాకిగా నిలబడ్డ నీవు-
కడలిగర్భంలో కల్సిన ప్రియుని దర్శనార్థం, ఒడ్డున శిలావిగ్రహమయిన
ప్రేయసిలా ఉన్నావు!

ఏ నేస్తం మరచినా, ఏ ఆత్మీయత నన్ను తలుచుకోక పోయినా,
తలవనితలంపుగా మనవూరు నోరుపడి నా పేరు కదపక పోయినా,
వీధిబళ్ళో పిల్లలు నన్ను గూర్చి కట్టు కథలు చెప్పుకోక పోయినా,
చెరువుకట్ట కూడలి సంభాషణలో నేను వినపడక పోయినా,
నీవు అద్దంలో చూసుకున్నప్పుడు నీతోపాటు నేను కనపడకపోయినా,
ఈ రాత్రి మాఅమ్మ నన్ను మరచి సుఖనిద్రాప్రపంచ పట్టాభిషిక్తయైనా,
నీవుమాత్రం ఈ నిశ్శబ్ద నిశీధిలో నన్ను దర్శించు; పల్కరించు!

అయితే మనం దాగుడుమూతలు ఆడుకున్న మామిడితోపు;
భావగీతాలు పాడుకున్న కాలవగట్టుకూడా మరిచాయా!

ఒకరాత్రి నక్షత్రాల్ని ఇద్దరం లెక్క పెడుతూ, నా లెక్క తప్పంటే
నిన్ను చెళ్ళున బాదగా చూడలేక బల్లున రాలిన నక్షత్రం జ్ఞాపకముందా!
ఖిన్న మైన ఆనాటి ఆకాశరాణి పదేపదే నన్నడగటం లేదా!
కాలేజీ సమ్మెలో నన్ను పోలీసులు చితకగొడితే, కన్నతల్లిలా
ఉపచర్యలు చేసిన నీ చల్లని హస్తం నన్నెలా మరిచింది!

ఎన్నో ఆనందాలు, అనురాగాలు కలలుగన్న నిన్ను
అగ వాట్ల ఆవరణలో వదలిపెట్టినందుకు విచారిస్తున్నా!
అన్నెం పున్నెం ఎరుగని పట్టి అమాయకురాల్ని
అగాధ ఖేదంలో దించినందుకు దుఃఖిస్తున్నా!
పెళ్లికి సర్వంసిద్ధపరచి విహంగాలలా స్వైర్యవిహారం చేస్తునప్పుడు
పెళ్లి పదిరోజులముందే మాతృభూమి పిలుస్తుందను కున్నామా!
నీ కోరిక మన్నించి, మహదాదర్శ ఆనతి శిరసావహించికదా
కారడవులలో మరణం తలకొడుతోంది!

ప్రాణస్నేహితులు సైతం నిరుత్సాహం అందజేసినా
మా ఇల్లు నా లేమితో వెలితిగా కనపడక పోయినా
నీకేసి రకరకాల పువ్వులు, హేళనగా నవ్వుతున్నా
మన ప్రేమను ఓర్వని కుళ్ళుతనం కుల్లికంపు కొడుతున్నా
కాలేజీ ఆడపిల్లలు వెక్కిరింపులతో నిన్నుడికించినా
పోలీసు కిరాతకులు కారుకూతలతో కండలు చీరినా
నన్ను మనస్సునుంచి నిస్పృహతో తుడిచేసేవు!

ఉత్తరాలు ప్రతిరోజూ వ్రాస్తూవుండు,
అక్షర అక్షరంలో నీమధుర స్వర ఆలాపన వింటాను!
పంక్తి పంక్తిలో నీ జీవన దృక్కోణం స్పర్శిస్తాను!
లేఖలో నీవు కనపడతావు, కరిగిస్తావు, గరళం త్రాగే శక్తినిస్తావు!

రెండు హృదయాలు కారణాంతరాలవల్ల వేర్వేరుగా,
దూరప్రదేశాలలో ప్రవాసం చేస్తున్నప్పుడు,
ఉత్తరాలు మహత్తర కార్యభారాన్ని నెరవేరుస్తాయి:
మాట్లాడతాయి, ఏడిపిస్తాయి; నూతనోత్సాహం ప్రసాదిస్తాయి!

కొత్త ఫొటోలు, పుస్తకాలు ఏమైనా ఉంటే పంపించు
నిత్యం నవ్వులో, పువ్వులో, నిర్మల కన్నీటి ధారలో కనపడతావు!
సెలయేరు జలజలలో, అరణ్య ప్రాణిరోదనలో నీపలుకు ప్రతిధ్వనిస్తుంది!
నిన్ను తలుచుకుంటే ఆకలితృష్ణక్లేశాలు అంతర్ధాన మవుతాయి!
ని ఫొటో హృదయ పేటికలో పెట్టి దాచిపెట్టుకున్నాను!
విప్లవం జయిస్తుంది, నేను త్వరలో యింటికి వచ్చేస్తాను!
నాకు స్వాగతం చెప్పడానికి పధ్నాలుగు ప్రపంచాల్ని పిలిపించు!

నేను విప్లవ విద్యుక్తధర్మాన్ని తుచ తప్పకుండా నిర్వర్తిస్తున్నా
విప్లవ సైనికుడి గమ్యం శత్రుమూక విచ్ఛిత్తి అని నీకు తెలుసు
కనుచూపుమేరలో గమ్యస్థానం మనకోసం పడికాపులు కాస్తోంది
మన పెళ్ళి పందిరి కోసం శత్రురక్తంతో విశాలాంధ్ర అరుణాయణంచేశాను!
మనకోసం మంచిరోజులు దండిగా ముందుకు ఎగప్రాకుతున్నాయి!
మహావిప్లవ విజయోత్సవంనాడు మన వివాహ మహోత్సవం జరుపుదాం!
నా హృదయంలోని హృదయమా, నాకోసం నిరంతరం ఎదురుచూస్తుండు!

రివ్వున శత్రు తుపాకిగుళ్ళు తలనొరుసుక పోతున్నవి—
ఎక్కడో మిత్రుడు "హాహా" కారంతో నేల కొరుగుతున్నాడు!!
విపరీత తుపాకి కాల్పులు అడవి గుండెను స్తంభింప జేసినవి!
ఉత్తరం ముగించి పగవాడి గుండెకు మరతుపాకి గురిపెడుతున్నా!
భయపడకు నాపేరు మృత్యుంజయుడు, నాకోసం ఎదురుచూడు!!!

—★—

తల్లి
తనయునికి:

నాయనా!

ఏకుపుతప్ప ఏముంది చెప్పడానికీ, వ్రాయడానికీ!
ఉన్న తరతరాలనాటి ఆస్తి, గౌరవమర్యాదలు వూడ్చుక పొయ్యాయికదా!
బలవంతంగా చద్దామంటే స్నేహితులు చావనీయక, చావురాక
ఎప్పుడూ నుయ్యో, గొయ్యో చూసుకోడానికి వీలు వెదుకుతున్నా!
నాలుగు ముక్కలు వ్రాద్దామని కూర్చుంటే, కడుపు తరుక్కుపోతోంది
ఏ విషయం జ్ఞాపకం చేసుకున్నా చాగెడంత పచ్చిరణాలను కెలుకుతు
న్నట్లుంది!

నీకు తెలియదుగా, తల్లిశోకం ఎంత పదునైనదో తెలియదు!
నీవు భూమిమీద పడ్డనాడు ఎంతగా ఉప్పొంగిపోయానో,
పాలుపోసి నీ చుట్టూ ఎన్ని ఆశల్ని, రెమ్మలు కొమ్మలు తొడిగించానో
పూలల్లో పెట్టి ఎంత గొప్పగా పెంచానో నీకు తెలీదు!
నీకు ఒక్క ఏడు తిరగకముందే మీ నాయన స్వర్గస్తుడైతే,
ఒంటరిదాన్ని నిన్ను పెంచడానికి ఎన్ని అవస్తలుపడ్డా!

పస్తులతో, బండబూతులతో పొద్దుపొడుస్తుంది, కూకుతోంది
ఏది తలుచుకున్నా కడుపులోచేతులు కలియబెట్టి నట్లుంది
'వాళ్ల'కు భయపడి మనపొలం ఎవరూ కౌలుకు చేయడంలేదు
నాతో మాట్లాడితే, నాకు సహాయపడితే, 'వాళ్లు' బాధిస్తారని
పొరుగింటి కాకికూడ మన ఇంటిమీద వాలడంలేదు
దిక్కులేని ఈ గుడ్డిముండ ఎలా బ్రతకాలో చెప్పునాయనా!

కాళ్లుకళ్లులేని నాకు మంచినీళ్లిచ్చే దిక్కులేదు
ఇల్లు పోలీసులకప్పజెప్పిపరుల పంచల్లో పడిఉంటున్నా
ఏడ్చే ఓపికకూడ లేక బూడిదముద్దలాగున్నా!
గడ్డకట్టిన కాసారాలలా ఉన్న కనుగుడ్లవెంట నీళ్లురావు!
కాని నా నిమిత్తం అరనిమిషం విప్లవమార్గం తప్పవద్దు!
నేనుపోతే భయపడవద్దు, 'వాళ్ల' సమాధిమీద నా సమాధి కట్టించుతండ్రీ!

ఉడిగిపోయిన నన్ను నీ మహోన్నత సంకల్పం ఉప్పొంగిస్తుంది:
మాతృభూమి విముక్తికి ప్రాణత్యాగం చేసే సుపుత్రుని కన్నతల్లిని!
అందుకు హర్షవర్షంలో పునీతమవుతున్నా!
నిన్నుగురించి, నీ శౌర్యాన్నిగురించి ఊళ్లల్లో ప్రాకిన కథలువిని
నీక్షేమంకోసం అహోరాత్రాలు భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా!
కాని, మృత్యువెదురైనాసరే, కన్నకడుపు కట్టతెగిన
నిండు చెఱువైనాసరే, వెన్నుచూపేవు, తలవొంచేవు!
శత్రు రుధిరంతో మా పరాభవాన్ని క్షాళితం చెయ్యి నాయనా!
పెద్దలమాట పూరికేపోదు, నేనూ ఆశీర్వదిస్తున్నా:
రావణుణ్ణి సంహరించిన శ్రీరామునంతటివీరుడ వౌతావు
ఆనాడు నాకు నిజంగా శాంతి లభిస్తుంది, జీవితం సార్థకమవుతుంది!

'క్రిష్ణా, రామా' అంటూ కాలం వెళ్లబుచ్చాల్సిన ఈ వృద్ధాప్యంలో
దినగండం నూరేళ్ల హింసాకాండగా బ్రతకాల్సి వచ్చింది!
లంకంత ఇల్లుగుల్లచేసి పోలీసులు క్యాంపు పెట్టారురా,
నన్నుచావచితక గొడితే భయపడలేదు, కానిచోట
కానని సీమల్లో ప్రమాదపు గండకత్తెరలో నీవు తలదూర్చితే
ఏడ్చి ఏడ్చి ఊరుకున్నా— కాని నా కోడలు............
అవును నీ భార్య......కన్న బిడ్డలా నాకు అండగా ఉన్న కోడలు......
ని భార్య...... ఏమని చెప్పేది నాయనా! ఎలా చెప్పేది.........

సీతాదేవివంటి నా కోడలు దిక్కులేని చావుచచ్చి బీటిలో పడిఉంటే
కాకులు, గద్దలు, పీక్కుతినే ఆకళేబరంమీదపడి నిలువెల్ల నీరయ్యాను!
నెలపొడుపు నాడు పురుగుకంటె హీనంగా చనిపోయింది నాయనా!
ఎందుకు నేను బ్రతకటం, ఏమి చూసుకుని బ్రతికేది!

ఆబిడ్డ మన గడప తొక్కగానే మనల్ని సకలైశ్వర్యాలు నెత్తికెత్తుకున్నాయి,
ఆమె నిష్క్రమించగానే అష్టకష్టాలు మనల్ని చుట్టుముట్టాయి!
ఎప్పుడూ నీవు జైళ్ళల్లో, అజ్ఞాత జీవితంలో, మగ్గుతున్నావు
ఆమె కంటికి మింటికి ఏకధారగా కళ్లు కరిగించింది నీకోసం!
నాలుగు దిక్కులు ముక్కుమీద వేలు పెట్టుకునేట్లు ఇల్లు గడిపింది!

తులసికోట ప్రశాంతత చూస్తే ఆమె ముఖం జ్ఞప్తికొస్తుంది
పచ్చని పొలం గంభీరతలో ఆమెరూపం ప్రతిఫలిస్తుంది
రామాయణంలో సీతమ్మ చెరలు ఆమెముందు తీసిపోతయి
మనం దక్కించుకోలేక పోయాం, ఆతల్లి మన ఇంటి మహాలక్ష్మి
నట్టేట్లో నన్నొదిలిపెట్టి నీ వరణ్యాలలో ఇడుముల పాలయితే
పుట్టెడుదుఃఖంలో నానుతున్న నన్ను కన్న బిడ్డలా కళ్ళల్లో పెట్టుకుంది!

ఒకరోజు పొద్దుకూకగానే 'వాళ్ళొ' చ్చి ఇంటిమీదపడి
కోడల్ని ఎక్కడికో ఈడ్చుకెళ్ళారు!
గజగజ వణుకుతున్న నేను పొద్దున్నే ఊరంతా కుతకుతలాడే
వార్తలు పిచ్చెక్కిస్తే తలనేలకేసి బాదుకున్నా!
గుంపులు గుంపులుగా కూడి కన్నీళ్ళు ర్మింగారు గ్రామస్తులు!

ఆనైచ్యం చెప్పడానికి నోరు పెగలటం లేదు, చేతులు వణుకుతున్నాయి,
ఆదృశ్యం ఎంత భీభత్సమో మనస్సుతో చూడు!
తక్షణం ప్రళయరుద్రుడవై అంతకు వేయంతల క్రోధంతో

విజృంభించి, విక్రమించి, వారిగుండె రక్తం పిండిరా!
ఆమె ఆత్మకు శాంతి ప్రసాదించు! అదే పదివేలు!!

నీ క్షేమ సమాచారం తెలిసి అరుమాసాలపైనయింది
నేను కళ్ళు మూసేముందు నిన్ను కళ్లారా చూడాలని ఉంది
ఈనా చిట్టచివరి కోరిక చెల్లించాలి నాయనా
మృత్యువు నిత్యం తలుపు తడుతూనే ఉంది
కోడలు పోయిననాడే నేను కాళ్ళు కాటికి చాచాను
కలుసుకోవడానికి వీలులేకపోతే, నాకడసారి క్షణంలో
నిన్ను స్మరిస్తూ, దీవిస్తూ, నీ విజయం ఆశిస్తూ, కన్నుమూశానని
తెలుసుకో నాయనా!

ంయుద్ధ

22B

పర్వము

నీలిమంటలు

ప్రవేశం:

చంద్రుడు విడాకులిచ్చిన
ఈ రోజు:
ఆకాశం అరుగుమీద
గుంపులుగా కూడిన
తారల గుసగుసలు -
నిశీధ శిఖరాలు
కప్పిన క్రోధం -
కరిగి గలగల జాలువారుతోంది
నిశాచరులు
నిరంకుశులు -
తీరని కోరికల
కొండలు ఎక్కుతోన్న
'పుణ్యకాల' ప్రవేశం
అజ్ఞానం విత్తిన
పరిపాలకులు -
పండిన పంటలు
నూరుస్తున్నారు!
మానవులను
వేటాడను -
నియన్తలు
ప్రభుత్వమనే
రేచుకుక్కల కళ్లెం

వదిలిన రామరాజ్యం ఇది !
చలికి వణుకుతోన్న
శ్రీమంతుల చలిమంటలు
విరిగిన బ్రతుకులు !
భూగోళం
కన్నీళ్ల కడవగా
పగిలి ప్రవహిస్తోంది !
ఆకాశం -
అగ్నులు కురుస్తోంది !
ఏడుసంద్రాలు
ఏకంగా
ఏడుస్తున్నయ్ !
నెత్తుటిదాహం
తీరని ప్రస్తుతం -
క్రూర మృగంలా
విక్రమించింది
కమురుకంపు
కొడుతోన్న లోకం
నీలిమంటలు కక్కుతోంది

ధ్వని :

జరిగిన
జరిగే
న్యాయం ఇక సాగదు
రాజ్యం ఇక చెల్లదు
ఇది అడ్డుకట్ట
ఇది ఆనకట్ట

౬]

ఇది అలంఘ్యం
ఇది అభేద్యం

కవి:

నేను వాక్కును!
కొత్తకాంతిని!
కొత్త శక్తిని!
సకల ప్రజకంఠం
నేను!
సమస్తదీనుల, హీనుల
ఒకేగొంతును!
దరిద్రం నా కన్నతల్లి!
తిరుగుబాటు నా తోబుట్టువు!
ఉదయించే మరోజగతి
నా తపః ఫలప్రపంచం!

అప్రస్తుతి:

నా ఒళ్లొలిచిన
నా కళ్లుతోడిన
లోకం కథ
చెప్పుకవీ!
నా మేధస్సు నెమరేసిన
నా ఎముకలు కొరికిన
నరరాబందులగోరీ
త్రవ్వుకవీ!
నన్నుగూర్చి
మహాకవిత
వ్రాయికవీ!

కవి:

నా అక్షరలక్షలు—
కష్టాల కాష్టంపై
నడిచే పరాధీనులు
విడిచే నిశ్వాసాలు!
బాధల చితిపై
బ్రతుకుతోన్న బానిసలు
వ్రాసే వీలునామాలు!
ఒరిగే వీరవరుల
స్మృతిచిహ్నంగా
రాలే నక్షత్రాలు!
విషాదాలు నిషాగా
త్రాగే నవకవుల
శోకశ్లోకాలు!

అపస్వరం:

ప్రజాపుత్ర
ప్రజాకవీ!
చల్లని నాచేతులతో
నీ మార్గంలో మల్లెలు
పోస్తా!
నరరక్తం బ్రాందీగా
నరచర్మం తివాసీగా
చేసి - జల్సాచేసే
కిరాతకుల మృత్యు
గాథలు చెప్పకవీ!

కవి:

క్రాంతిని వరిస్తాను!
శాంతిని వచిస్తాను!

అసత్యాలను హతంచేస్తా!
సత్యాలను ప్రతిష్ఠిస్తా!
సమాజం పై—
భీభత్స సమాజంపై
సమరం ప్రకటిస్తా!
మనుష్యులను చదువుతాను!
మానవులను రచిస్తాను!

అపస్వరాలు :

మా గుండెలు
పచ్చిపుండ్లు!
మా బ్రతుకులు
శిలువెక్కిన
జీసస్‌లు!
మా కాంక్షలు
కెగసరికిన
నందనాలు!
మా ఇంట్లోదీపం
ప్రతీకార బడబాగ్ని!
మాగుండెల రక్తం
పగలెగసే తప్తధార!

కవి :

సింహంలా విక్రమించిన
మహాప్రజ
నా మహాకవిత!
ఎర్రగన్నేరు హారంతో
ఊరేగే దొరలగుంపు
నా అగర్భ శత్రుతతి!

పాలకుల గుండెలునమిలే
బుల్లెట్స్ నా మాటలు !
ఏలికల కండలుకరిచే
బాయినెట్స్ నా పాటలు !
సింహాసనాలు కూల్చే
శతఘ్నులు నా వ్యూహాలు !
బలిపీఠాలు పగిల్చే
బాంబర్లు నా వాక్కులు !
శత్రుసంహార యాత్రలు
నేవ్రాసే చరిత్రలు !
పాలిచల్లిన రాత్రులు
నా విహారయాత్రలు !
నాపేరు కమ్యూనిస్టు !
నేను భవిష్యత్తును !

విషాద కంఠాలు :

చీకటి వాకిట్లో
చింతల చితిపై
నిరంతరం వేగుతున్నాం !
నిత్యం వాపోతున్నాం !

చిగిర్చని ఆశాలతలు
పరచుకొని పయనిస్తున్నాం !
ఎర్రని ఆకలికడుపులు
కప్పుకొని పడుకున్నాం !
కలవారి మేడచుట్టూ
కళ్లు మూసుకుంటున్నాం !

కవి సందేశం :

చిరిగిన సహోదరీ !
చితికిన సహోదరా !

8] సకిలించిన సంగ్రామం
గర్జించిన తుదిసమరం—
దోసెడు రక్తాక్షితలు
చారెడు నెత్తుటి గంధం
తెచ్చాయిదె పుచ్చుకోండి !

ఒక కంఠం :

దొమ్మీగా, దొంగలుగా
మము దోచిన, మము పీల్చిన
నరహస్తల్లారా నడవండిక !
మీరు కట్టించిన —
కారాగారాలకు !
కనిపెట్టిన ప్రవాసాలకు
మీ పైబట్టలే
మీపై పగబట్టిన
పెనుపాములు !
మీరెత్తిన వురికొయ్యలు
మీ కుత్తుక కేసైను వురివుచ్చులు !
మీరు తెచ్చిన బారుఫిరంగులు
మీరొమ్ములకే గురిపెట్టెను
అడుగడుగూ అగాధమై
అగడ్తలై అనన్త హస్తాలై
మీ ప్రాణాలను బలిగా
పొలిగా కోరుతున్నయ్ !

విప్లవ కంఠాలు :

రారాజుల కిరీటాలు
మా దారికి సోపానాలు !
కడయుద్ధం ఒడిలో

విశ్రమించు యోధులు
మారాస్తాపై మైలు రాళ్లు!
నెత్తురు పారిన నేలలు
ఎత్తిన పంటలు మేం!
విలయాలు వర్షిస్తాం!
ప్రళయాలు కురిపిస్తాం!

సమాప్తం:

ఎఱ్ఱబడ్డ
తూరుపు కొండలు
దిగద్రాగిన
నీలిమంటలు!
కనుచూపుమేరలో
కనలే కాటి మంటలు!
చీకటి రాకసి పాలన
చెరిపిన నీలిమంటలు!

* * *

పొలిపాట

పడుతూ లేస్తూ
లేస్తూ పడుతూ
నడువలేక
ఇక నడువలేక
ఈద్వలేక
లోకం కాడి
అడుగేని ఈద్వలేక—
అనాథ జనసముద్రం
అలగాజన సందోహం
పెను అలలా వీగింది!
విలయంలా వ్యాపిస్తోంది!

ప్రశ్నమార్కు బ్రతుకులు
ధరించిన
శిలువమార్కు అన్నలారా!
ఏదో సముద్రంలో
మరేదో హిమాలయంలో
ఏదోఏదో భువిగర్భంలో
ఏదోఏదో మీయెదలో
గుప్పున పొగలిడుస్తుంది
బుస్సున బుసలిడుస్తుంది
ఈ క్షణం వీక్షించండి!
మరుక్షణం క్రమించండి!

ఎన్నాళ్ళూ
ఎన్నేళ్ళూ
మిమ్మి మీరు పీక్కుతింటూ
మిమ్మి పరుల కెరగ వేస్తూ
ఏడుస్తూ నడుస్తారు?
ఏడుపులో తడుస్తారు?
ఏడుపుతో మరణిస్తారు?

ఎక్కడికి
ఎంతదూరం —
కళ్లు కార్చుకుంటూ
ఒళ్లు ఓడ్చుకుంటూ
పరుల మోసుకుంటూ
నడుస్తా రెక్కడికి ?
దడుస్తా రెందుకు ?

పారిపారి కళ్లు ఎడారులైన చెల్లీ !
ఎండి ఎండి వక్షం వట్టిపోయిన తల్లీ !
సకలలోక ప్రజావదనంపై
ఉదయం ఉదయించిం దిప్పుడే!
సమస్త భ్రాతల ఫాలంపై
సమరం మెరిసిం దిప్పుడే !

కూలుతున్న ఆశాశిఖరాలపై
కూర్చున్న సహోదరా !
పెరుగుతున్న దుఃఖం ఒడిలో
నిద్రించే మిత్రుడా !
ఒక్కసారి చూడండి !
కనుచూపుమేరలో

41 కరకర పొడుస్తున్న పొద్దు!
బిరబిర నడుస్తున్న ప్రజ!

అన్నలూ —
అశాంతి తిని బ్రతకలేరు
ఆకలి నమిలి ఉండలేరు
కలవాళ్ల మోస్తూ నడవలేరు
అంతా రణరంగం నడపండి!

చెల్లెళ్లా —
జీవిత కుసుమాలను
తొక్కుకుంటూ సాగిపోలేరు
సుస్మిత హృదులను
రక్కుతింటూ బ్రతకలేరు
అంతా యుద్ధభూమి పదండి!

తమ్ముళ్లూ —
ముళ్ల తొడుగు జీవితాలు
ఈడ్చుకుంటూ నడువలేరు
ఇవాళో విడిచిరండి!
ఇప్పుడే ఎదిర్చిరండి!

అన్నలూ—
నిప్పంటించండి
నిరాశా రాసులకు!
నిస్పృహ కుప్పలకు!

శిరస్సులు నేలవాలెను
మోయలేరు
ఇక దించండయ్యా —
కష్టాల మోపులు!

మ్రింగలేరు
ఇక పంచండయ్యా—
పదిమందికి
ప్రతీకారాగ్ని శిఖలు!

త్రాగలేరు
ఇక చల్లండయ్యా—
ధరిత్రినిండా క్రోధం!

ఆర్పండీ—
ఇల్లిల్లూ కాల్చుతున్న
ఆకలి మంటలు!

వెలిగించండీ
ఆగిన నాళాల్లో, నరాల్లో
నవచైతన్యం!

అందుకోండి తమ్ముళ్లూ—
వెనుకబడ్డ అన్నలనూ!
కలుపుకోండి అన్నలూ—
నడువలేని అమ్మలనూ!

అంతా చేయిచేయి కలిపి
అంతా 'హరహరో' అంటూ
అన్నం అడగను పదండి!
న్యాయం పొందను నడవండి!

అరిచేతిలో గీతలరిగిన
అక్కా!
నడివయసులో
మూడుకాళ్లనడిచే

అన్నా !
ఈ 'కొత్త' నొసట
రాసుకొని 'ముందులోకి' చూడండి !
ఈ సమరసందేశం
అందుకొని అనండీ !
ఈ విప్లవ నినాదం
వింటూ పదండి !

అనాథలూ —
అవధరించండి
ఈ నినాద అగ్నినావ !
అధిష్టించి
అతిక్రమించండి
ఈ దుఃఖసముద్రం !

దారిచుట్టూ విరిసిన
ఈ ఎర్రని పువ్వులు
రాలిన వీరవరులు !
దారినిండా మొలిచిన
ఈ నల్లని గోరీలు
తెగిన శత్రుకంఠతతి !

మీ ఆశలు అల్లుకోను
మీ గుండెలు నాటండీ !
మీ ఆదర్శాలలుముకోను
మీ కండలు చల్లండీ !

మహానదులు దాటేందుకు
మీ ఎముకలు పరచండీ !

మీ మార్గం సాగేందుకు
మీ వెన్నులు విసరండీ!
శాసనాలు, సంకెళ్లను
తెగగొట్టుక సాగండీ!

ఇంజన్‌లో బొగ్గేయకు
ఇరుసుమీద చమురేయకు
అశాంతిపై నీళ్లుపోయకు
అసంతృప్తి అణుచుకోకు —

వడ్డించొద్దమ్మా —
ఇవాళ పళ్లెంలో కష్టాలు!
గ్లాసుతో కన్నీళ్లు!
అశాంతులతో, అన్నలతో కలిసి
నేనుకూడ
యుద్ధభూమి కెళ్తున్నా!

అయ్యా—
పరుల పాతళ్లూ, గాదెలు
తరతరాలు నింపలేను
గుండెలు కుంపటిమీద
వేగుతున్నయి
ప్రాణాలు కనుకొలుకుల్లో
కొట్టుకుంటున్నయి
దశాబ్దాల ఆకలితో
శతాబ్దాల నీరసంతో
అడుగైనా వేయలేను
ఈ నాగలి
ఈ రోకలి

10]

పుచ్చుక నేనుకూడ
మీతో నడుస్తాను !
మీతో మరణిస్తాను !

అమ్మా —
కొండరాళ్ళు కొట్టికొట్టి
చేతులు కాయలు కాసినయి
బొమికలు కుళ్లిపోయినయి
ఇక కోటలు కట్టలేను
ఇక మేడలు ఎత్తలేను
మోసినన్ని ఈ రాళ్లెత్తుకొని
నేనుకూడ
మీతోవస్తాను !
నేనుకూడ
మీతో ఆహుతౌతాను !

అయ్యా —
ఫ్యాక్టరీ గొంతులో
నిత్యం దోసెడునెత్తురు
పోసిపోసి కృశించి
నశిస్తూ వసిస్తున్నా !
నిరంతరం మృత్యువు గ్రోలుతూ
నిత్యం ప్రమాదంపై పయనిస్తూ
ఇక చాలాకాలం మనలేను
నేనుకూడ దరిద్రుల
దండయాత్ర చేరుతాను !
నేనుకూడ దరిద్రుల
దండుతో చనిపోతాను !

అయ్యా—
ఈ జీవితం ఇక త్రాగలేను
ఈ కాలకూటవిషం ఇక జీర్ణించుకోలేను
నేనుకూడ మీతోవస్తాను !
నేనుకూడ మీతో కళ్ళుమూస్తాను !

అమ్మా—
అవినీతి కట్టుకొని
ఇక తిరగలేను
అవమానం పుచ్చుకుంటూ
ఇక నడవలేను
నోరులేని ఆవేదన
విద్వేషంగా అనువదించా !
నేనుకూడ మీతోవస్తాను !
నేనుకూడ మీతో అంకిత మౌతాను!

"కాదు కాదు తమ్ముడూ
కాదు కాదు చెల్లెలా
విప్లవం - రక్తపాతం కాదు !
ఇవాళను రేపటితో
కలిపే వంతెన విప్లవం!
భావిని అడ్డగించే
నాగరికత కాళ్లునరికే
నియన్తల తుడుచుకుంటూ
నరహన్తల తరుక్కుంటూ
పరిచే మహారాస్తా విప్లవం!"

నిత్యం నను పరిపాలిస్తున్న
తుపాకుల విరిచేస్తాను !

నిరంతరం కండలు తరిగే
కసాయిూల సంహరిస్తాను!
అనుదినం నను లాలిస్తున్న
అనుదినం నను పాలిస్తున్న
షరాబుల వధిస్తాను!
సహోదరుల కలుస్తాను!

సముద్రాలు, సరస్సులు,
అరణ్యాలు, పర్వతాలు,
పర్వతాలు, పట్టణాలు,
పట్టణాలు, పల్లెలు,
జైత్రయాత్ర సాగుతున్నయ్!

తుపాకులపై, ఫిరంగులపై
కార్మిక మహాజనం నడుస్తోంది!
శతాబ్దాల పాలక ఏలిక
పునాదులపై శ్రామికజనావళి
జయధ్వానంతో ప్రవహిస్తోంది!

రండర్రా మీరంతా
చేరండ్రా ఈ సైన్యం!
ఇవాళే విముక్తిమీకు!
ఇవాళే నవజగత్తుకు
నాంది ప్రస్తావన!

ఈ కంటికి రెప్పలు లేవు
ఈ ఇంటికి గోడలులేవు
ఈ సముద్రంచుట్టూ
చెలియలి కట్టలేదు

ఈ మహా సైన్య
సంకల్పానికి విఘ్నంలేదు
చర్చిలో శిలువలేదు
గుడిలో విగ్రహంలేదు
కోర్టులో చక్రవర్తి
పటంలేదు
కుర్చీలో గుమాస్తాలేదు
శిబిరంలో గూర్ఖాలేదు
ఔను ఇది ప్రళయం!
ఔను ఇది సమరం!

మారణయంత్ర ధ్వజం
ఎగురుతోన్న శత్రుశిబిర
వికటాట్టహాసం చూశారా ?
మానవుడే జండాగా
ఎగురుతోన్న మనశిబిర
శాంతి సంగీతం విన్నారా ?

ఆగిందమ్మా గాలి
ఆగిందయ్యా వాడి
సాగిందమ్మా సంగ్రామం
కోరిందయ్యా రుధిరం
నడవండమ్మా ముందుకు
తడపండయ్యా ధరణి

కాల్చుకోండి
పేల్చుకోండి
ఇవి కండలు
ఇవి బండలు

11]

ఇవి గుండెలు
ఇవి కొండలు
ఇక కాల్చుకోండి
ఇక ప్రేల్చుకోండి
మరతుపాకులు !
మర ఫిరంగులు !
ఎర్రని మా రొమ్ములు
మహాపర్వతశ్రేణులు!
చల్లని మావాంఛావరదలు
అనంత జలనిధులు !

వేసికోండి తాళాలు
ఫ్యాక్టరీ ముఖాలకు !
మూసిపొండి ఏకంగా
ఇప్పుడే ప్రభుత్వ భవనాలు !
వ్రాసిపొండి మీరె మీమీ
మరణ శిక్షా పత్రాలు !
పుచ్చుకొండి మెషీన్‌గన్లు
విషంలా మెషీన్‌గన్లు
ఈ ఉప్పెన దాటేందుకు-
కాదు మీ గోతులు నిండేందుకు !

ఆకాశమంతా
గుట్టలుగా
గుబుర్లుగా
తోకచుక్కలు !
మబ్బులనిండా
నిప్పుకొండలు !
గుండెలనిండా

మంటలు !
మార్గమంతా
మనుషులు—
మనమార్గమంతా
మానవులు—
మన శిబిరమంతా
మనుషులు !
శత్రు శిబిరమంతా
యంత్రాలు—
శత్రు శిబిరమంతా
నరయంత్రాలు !
శత్రుశిబిరమంతా
మృగాలు—
శత్రు శిబిరమంతా
మందుగుండుమయం !

భ్రాతలార
విసరండి !
మిత్రులార
రువ్వండి !
వీరులార
కవ్వండి !
తృణాలుగా
ప్రాణాలు !
అణ్వాలుగా
ఆధారాలు !
అర్జునులులా
అనిఅంతా !

ఎగరేయ్
ఎదురొచ్చే
దెవరైనా
ఎవడైనా !
ఎగరేయ్
ఎర్రజండా
ఎగరేయ్ !
పగలేయ్
పగలేయ్
శత్రుదుర్గం
ముక్కలుగా
చెక్కలుగా
పగలేయ్ !

అంతా ఒక్కసారి నినదించండీ!
అంతా ఒక్కసారి యుద్ధగీతి నినదించండీ!
అంతా ఒక్కసారి అనండీ!
అన్నదే ఏకంగా అనండీ !
'ప్రస్తుత' చరమగీతి పలకండీ!
లోకంమాదని
లోకం మేమేనని
అనండీ!
భావిస్వాగతం పలకండీ!
శాంతిద్వారం తెరవండీ!
స్వేచ్ఛాశిరస్సు నిమరండీ !

మోడువడ్డ ఈ వృక్షం
చిగిర్చిందిటు చూచారా !
అణగారిన ఆ ముఖం మీద
వెన్నెల తరంగం
తొణికిందటు చూచారా !!

—★—

తెలంగాణా!

i

ఎందుకు అమ్మా
కంటతడి పెట్టావు?
ముక్కోటి సంతతి ఉన్నామే!
షట్కోటి హస్తాలున్నాయే!

ఎందుకు తల్లీ
గజగజ వణికావు?
తెలుగునాడు నిప్పు కొండే!
అడుగడుగూ తుపాకి గుండే!

ఎందుకు జననీ
చిక్కి శల్యమయ్యావు?
పాడిగోమంద మిసమిస లాడుతుందే!
కోటిజనం కండలు కరిగిస్తుందే!

ఎవరమ్మా నిను
పరాభవించింది?
ముక్తినిసాధించే నీబిడ్డలున్నారే!
రక్తరంజితపతాక రెపరెపలాడుతుందే!

ఈ ఊరు కారుచిచ్చునాకిన
అరణ్యంలా ఉందెందుకు?
సముజ్జ్వల యువశక్తి తొణుకుతుందే!
ప్రాణం పణంచేసే ప్రజ పొంగిందే!

12\] చల్లని తల్లీ నిండు ఇంట్లో
ఆకటికాహుతి అవుతావేం?
దండిగా ఆకాశం కురుస్తుందిలే!
పంటచేలు పుష్కలంగా పండుతాయిలే!

వేళకాని వేళ కళ్లు
చెమ్మగిల నీయకమ్మా!
నిలువున కడలి ఇంకిపోతుందో!
సూర్యచంద్రులు గతి తప్పుతారో!

అనంత దైన్యరాశివై
భీష్మించి కూర్చోకమ్మా!
ప్రాణికోటి ఆయువు జారిపోతుందో!
సప్త సముద్రాలే గడ్డకడతాయో!

పగతో భయానకంగా ప్రళయ
రుద్రనర్తన చేయకమ్మా!
సకలగోళాలు ఢీకొంటాయో!
పునః సృష్టి జరుగుతుందో లేదో!

ii

ఎన్నెన్నో నోములునోచికన్నానే నాన్నా
ఎన్నెన్నో వ్రతాలుచేసి పొందానే బిడ్డా
మృత్యువునోటికి మిమ్మందించాలంటే
కన్నకడుపు వేదనతో తరుక్కొనిపోదా?
కాని విరంకుశుల కాలికింద బ్రతికేకంటే
తలెత్తి కత్తికి బలికావడం తల్లికి మహదానందం!

చూశారా, నీచుడైన నిజాం కీచకునీ
నా సంతతి పొట్టపెట్టుకున్న పిశాచినీ
నా కడుపు కొట్టి కోటికి పడగెత్తాడూ
వాడు నా అగర్భ శత్రుకోటి సేనానాయకుడూ
వాడు పక్కలో పగబట్టిన పామువంటివాడూ
వాడు కన్నతల్లి రొమ్ముగుద్దిన వాడూ
వాడిబొందిలో ఊపిరుండగా నాకు నిద్రరాదు!
వాడికింద శతాబ్దాలు ఊడిగం చేసేకంటే
తక్షణం కూలినా, రణపతాకనెత్తడం ధర్మం!

ఇప్పుడే నిందు మానవుని హత్య జరిగింది
ఇక్కడే కొత్తపాట తెగి పడిపోయింది
చూడండి, వాడిచేతుల తడి చూడండి
వంటిమీద నెత్తురు డాగులు ఏరి చూడండి
వాడిబొడ్డులో బాకు పట్టి పరీక్షించండి
అరీ ఆరని నేలమీద మరకలు పరిశీలించండి
సందేహంలేదు వాడు పచ్చి కసాయివాడు!

చూడండి, దారుణం, దిగంబర పరాభవం
కారణంలేని దుర్మార్గం, కళ్లులేని కాఠిన్యం
రచ్చబండముందు అతని వీపుమీద బండ
ఠాణాగోడకింద అతని గుండె పచ్చడి
అరణ్యప్రాంగణంలో తెగిపడ్డవారి శిరస్సులు
అరణ్య హృదయంలో రాలిపడ్డవారి ప్రాణాలు
అడగకండి, ఆలోచించకండి, అన్యాయం అంతేనండి !

కీడుమూడిన నేడు ఎక్కడికి పోతారు
దోవచూపేవాడు పగవాడి కమ్ముడు పోయాడు
పాడుపడ్డ నుయ్యిలో నీళ్లిందుకుంటాయి
గోడచాటు నక్కిన తోడేలు చూడండి
వెంబడించే భయాన్ని పరిహరించకుండా పోతారేం?
ఎదిరించే ప్రమాదాన్ని సంహరించకుండా సాగుతారేం?

బానిసగా, బందీగా కాలం వెళ్లదీయ లేను
నిరుపేదగా, పరాజితగా ఏళ్ళు ఈడ్వలేను
వినండి, నామాట వినండి, చిరంజీవులార!
ఘనంగా నా తపస్సు ఫలాలు పండనీయండి!
అనఘులు తనయులు అని ప్రవేశించండి !
నిజాం నవాబు కాలికింద నేల తొలవండి !!!

★

గెరిల్లాలతో ఒక నిమిషం

అంతా క్షేమంగా, కులాసాగా
వున్నారా ప్రాణమిత్రుల్లారా!
ఎప్పుడూ 'జాగ్రత' పై ప్రయాణం
చేయండి నా పంచప్రాణాల్లారా!

మీకోసం చెట్టుకొక్క
పువ్వుకోసి మాల గుచ్చాను!
లక్షభాషా సంద్రాలు తరిచి
శతకోటి పాటలల్లాను!

మీరు రాలినా, నిలిచినా
పేరుకొక్కటి కోటకట్టాను!
కోటకోటలో మీ స్మృతికై
నగరమొకటి సృష్టి చేశాను!

తేనెపట్టుకొక్క బొట్టుతీసి
అమృతంచేసి తీసుకొచ్చాను!
ఆవు ఆవుకు గిన్నెడు పాలు పితికి
మీ కాళ్లకు వారుపోయ వచ్చాను!

ఎన్నో పాలవంటి తెల్లని పూలు
మీదోవనిండా పరిచేందుకు తెచ్చాను!
ఎన్నో తల్లివంటి స్వచ్ఛమైన
నా స్వప్నాలు ఏరితెచ్చాను!

18]

అనామకంగా అడవులలో వీరమరణం పొందిన
శూరుల మహోన్నత జీవిత కావ్యాలు వ్రాసుకొచ్చాను!
శత్రు తుపాకి కాల్పులకు కూలిన ప్రతివీరుని
రక్తపుమడుగున మహా జయస్తంభం ఎత్తివచ్చాను!

నడచినడచి బొబ్బలెక్కిన మీ పాదాలను, పాదధూళిని
నా వెచ్చని కన్నీళ్లతో క్షాళనం చేయవచ్చాను!
మీ గుండెలలో వెలిగే మహోజ్వలాదర్శానికి
ఆకాశంతాకే స్వరూపం కల్పించి ఆయువు పోస్తాను!

ఒరిగిన యోధుల సమాధిమీద
నందనవనాలు నాటి వచ్చాను!
మొగ్గమొగ్గకూ, విషాదసంతప్త
జీవన రాగాలు నేర్పివచ్చాను!

వీరమాతా పితలు పంపిన
రక్తగంధం పట్టుకొచ్చాను!
అందిన ఆచూకీ, పొందిన అనుభూతి
కనురెప్పల్లో దాచి తెచ్చాను!

మీ తలిదండ్రుల, భార్యాపిల్లల
క్షేమసమాచారం తెలిసివచ్చాను !
పాలాలు పాలికేక లేస్తూ, పౌరుషాలు
పండుతున్నవని చెప్పిరమ్మన్నారు!

ఎవరైనా కాస్త శాంతిగా వున్నారేమోనని
దేశం నలుమూలలు గాలించిచూచాను!
అలజడి, అశాంతి, అన్యాయం, ఆక్రందన—
పరిపాలనలో మాతృదేవి బందీ అయింది!

ఎక్కడైనా ఒక చిరునవ్వు చూద్దామని
బండెడు ఆశలతో కాళ్ళు కాయలు కాయించాను!
అవమానం, ఆకలికొలిమిలో వేగుతున్న
దేశం ద్వేషంతో భగ్గున మండుతోంది!

మరణం, కన్నీళ్ళు భూదేవి ముఖం
నుండి తుడిచేయను రణం కావాలి!
హత్యలు, మృత్యువు ప్రసాదించే
ఈ వ్యవస్థను భూస్థాపితం చేయాలి!

మండే ఎండలో కండ కరిగే రైతులు
గుండెలొడ్డి మీలో చేరవస్తున్నారు!
నెత్తురుపిండి యంత్రం నడిపే కార్మికులు
ఏకంగా తీవ్ర సంఘర్షణకుద్యమించారు!

కరకర పొడిచే పొద్దులుగా యువకులు
ఈ అర్ధరాత్రి మీలో చేరవస్తున్నారు!
చరచర పొంగే ఉప్పెనగా యువతులు
సాయంత్రం దళాలలో చేరిపోతారు!

మీరు తరచూ చిల్లర వెచ్చాలకు వెళ్ళే
అడవిపాలెంలో యం. యస్. పి. మాటుపెట్టింది!
మీరు రాత్రులు సంచరిస్తారని తెలిసిన 'జ'
ప్రదేశం చుట్టూ గట్టిపోలీసు నిఘావుంది!

క్యాంపులో తెల్లజండా ఎత్తిన నాయకుడు
పత్రికలలో విద్రోహ ప్రకటనలకుపక్రమించాడు!
ద్రోహులు పోలీసు వ్యానులలో తిరుగుతూ
తెలిసిన సమాచారం పొల్లుపోనివ్వడంలేదు!

ఉత్తర దక్షిణ ప్రాంతా లెళ్లిన
కొరియర్లు నిహతులయ్యారు!
పగవాళ్లు ప్రతినీటిగట్టున
మాటుపెట్టుక పొంచి ఉన్నారు!

మీరు మంచినీళ్ళకు వెళ్లుతున్న
నక్కల మడుగులో మందుకలిపారు!
చిక్కిన దళాల నాయకుడు తల్లి
రొమ్ముగుద్ది రహస్యాలు కక్కుతున్నాడు!

పంచభూతాలు మన అక్షయ వజ్రకవచాలు!
అశేషప్రజానీకం మన విలువైన పంచప్రాణాలు!
చంద్రుడు మన గెరిల్లా క్యాంపులో లాంతరు!
పృథ్వీ హృదయం ఎర్రసేనల రక్షణప్రాంతం!
పదండి! పరిక్రమించండి !! జయించండి !!!

★

బహిరంగ లేఖ

i

ఏ జాబుకూ జవాబుకాని జాబు వ్రాస్తున్నా
మిమ్ములనుద్దేశించి మీ భావాల నిర్దేశించి
నా కను పాపల్లారా! మిము సంబోధిస్తున్నా!

ఏమహారణ్యాలలోనో, దుర్భరబాధలలో కాపురంచేస్తూ
నిరంకుశత్వపు జీవనాడులు తెగించి తెగవేసే
నాజీవనాళాల్లారా! మీతో సంభాషిస్తున్నా!

బీటలువారిన పరిస్థితులలో కాళ్ళు కూరుకపోయినా
పెనుబాములలకుమల్లే మెడచుట్టుకున్న ఇడుమల విదిలిస్తూ
నడిచేఅన్నలార,.నాప్రతిబింబాల్లార! మీకు లేఖవ్రాస్తున్నా!

ఔను మాటలు తడబడుతున్నవి, తొణికే అక్షరాలు వణుకుతున్నవి
కళ్లారా మిముచూచిన, మిము కాటందే రాక్షసాలు చవిచూచిన
నా హృదయం ద్రవించి కళ్ళవెంట స్రవిస్తోంది!

దోవలలో, లోయలలో, పాయలలో ప్రమాదాలు దాగున్నవి,
పొదలలో, పుట్టలలో, గుట్టలలో, అపాయాలు పొంచున్నవి
పొదరిళ్ళలో, ఇళ్ళల్లో, పురవీధులలో హత్యలు ఎదురౌతున్నవి
చెట్లచాటున, కటకటాలమాటున దౌష్ట్యం తల విరబోసుకుంది
కొండవెనుక, గూడువద్ద రేచులూ, త్రాచులూ కాచి ఉన్నవి
అంతా ఎఱ్ఱదీపాల్లారా! అంతా ప్రశాంత నిశి నిశ్శబ్దం!

మీ అడుగులజాడలకోసం లోహపు పాదాలు అడవులు గాలిస్తున్నవి
మీ మాటల మూటలుమోసుకొనిపోను గాలులు మీ వెంట నడుస్తున్నాయి
మీలోని చీమ సందులుచేసిన ఓరవాకిలిగుండా ద్రోహులు జొరబడతారు
కరకర పొడిచే పొద్దుల్లారా! ఎత్తండి కోటికోట్ల జ్వాలాహస్తాలు, మీ
పతాకాలు!

పిరికివ్యాధి పీడించే, ప్రమాదాలు కలిగించే
ద్రోహశక్తులన్నిటిని సమూలంగా ఛేదించండి!
అవినీతికి, అమావాస్యకూ ఆకారమైన అధికార హస్తాన్ని
ఉవ్వెత్తుగా పైకెగబడి ఉత్తరక్షణం ఉత్తరించండి !!

అడుగుతాకడానికి, అరాతీయడానికి
అచూకీ పెల్లగించడానికి అర్రులు బారలుగా సాచిన,
వాసన పసికట్టను పొంచిన మృగాల పాలితీయండి!

నీరసంగా నిట్టూర్చే ఎలెక్ట్రిక్ దీపాలూ!
వార్తలకోసం వడిగట్టిన తంతితీగలూ!
చెప్పండి మిత్రులతో 'వాతావరణం అనుకూలంగా ఉందని!'

చిటపట ఒక్కొక్కటిపడే జల్లుచినుకులూ!
కన్నుపొడుచుకున్నా కానరాని గాండాంధకారమా!
ఈ అంతులేని ముసురులో త్రోపచూపండి మిత్రులకు!

పూచే పువ్వులూ, కొమ్మలూ
వీచే గాలులూ, తుపానులూ
తెలియజేయండి సహోదరులకు—
క్షేమసమాచారాలు !!

కబురుకోసం వచ్చిన కాకులూ, కష్టజీవులూ!
జనంనాడి తెలుసుకోనువచ్చిన నేలబాలులూ, భానులూ!
చెప్పండి ప్రాణమిత్రులతో సర్వం సిద్ధంగా వుందని!

ఓ భ్రాతల్లారా, మీ శక్తులు సప్తసముద్రాలు
మీ కాంక్షలు అనంత హిమవత్పర్వత ప్రమాణాలు
ఏదీ, నా తోబుట్టువులూ! ఆకాశం అంచులనంటండి!

'నిజం' ఫాలంమీద విరిసిన విజయాన్ని పల్కరించండి
న్యాయం ఎలుగెత్తిచాటే ఉద్గ్రంథం పేరు మీదే చూడండి
మీపాదాలకు మోకరిల్లే అష్టదిక్కుల్ని ఆశీర్వదించండి!

ఎంతో చెప్పాల్సిందీ, మరెంతో వ్రాయాల్సిందీ వుంది
ఎందుకో చుట్టూ విపత్తుల రెక్కల చప్పుడు వినబడుతోంది
నేటికిసెలవు, నా రక్త నాళాల్లారా! తస్మాత్ జాగ్రత!

* * *

అరిచేతిలో మృత్యువు

[చిమ్మచీకటి కప్పుకునిపడుకున్న అర్ధరాత్రి. అర్ధరాత్రిచుట్టూ కీకారణ్యం. అరణ్యహృదయంలో గెరిల్లాదళ రక్షణ కేంద్రం. దళం మీద యస్. ఎ. పి. క్రూరమైనదాడి. నిశీధి వీధిలో దళం ప్రయాణం. దోవ తెన్నులేదు. దూరంలో దయ్యాలలా కూస్తున్న కొండలే దిక్సూచి.]

జాగ్రత, కామ్రేడ్స్
ముందుబాట జాగ్రత!
నెత్తిమీద బరువు జాగ్రత!
బ్రతుకు జాగ్రత!

లోయగుండా త్రోవ
ముందుపారచూడు కామ్రేడ్!
వీపుమీద మూట—
అజాగ్రత కూడదు కామ్రేడ్!

జాగ్రత, భుజంపై తుపాకి
అదే మన పంచప్రాణం!
మొలలో తూటా బెల్టు!
అదే అదే మన సర్వస్వం!

జీవితం అసిధారావ్రతం,
నూలుపోగుమీద సాము
మరణంపై తిరుగుబాటు
ఔను మనంతప్ప వీరులులేరు!

దారినిండా ముళ్లకంచెలు—
పంక్తి చెడకుండా కామ్రేడ్!
జాగ్రత! కాలికింద చెప్పులు
చేతిలో నీటికడవలు!

గుసగుస పనికిరాదు భాయీ!
కిచకిచ—ఎక్కడో చప్పుడి!
చకచక నడవండి కామ్రేడ్స్!
గమ్యానికి చేరువగా వచ్చాం!

ఇక్కడకాదు ముళ్ళు తీసేది
నడువు కామ్రేడ్!
ఇప్పుడుకాదు కాళ్లు కుంటడం
దళంలో కలిసి పదవయ్యా!

చలి, తీవ్రంగా చేదుగా కసుస్తుంది
ముళ్లు సూటిగా, కర్కశంగా నాటుతున్నాయి
బాధనకుండా, బద్ధగించకుండా పదండి!!
జాగ్రత, భుజంపై తుపాకి, బొడ్డులో బాకు!!

ఏదో అలజడి వినపడుతోంది
చెవులు గోళాలు చేయుండి!
ఏదో వెలుగుపోచ తగులుతుంది!
కళ్ళు కాగడాలుచేసి చూడండి!

"నక్కలు కూస్తున్నాయి
పూరేదన్నా దాపులో వుందా!
మృగాలు అరుస్తున్నాయి
ఏవన్నా ఏటిదరి చేరామా!"

"కుక్కలు మొరగందే
వూరెక్కడ కామ్రేడ్!
కొందరయినా కూలందే
నీరెక్కడ దొరుకుతుంది!"

ఇస్! నిశ్శబ్దం, కసి!
ఉష్! ప్రమాదం, పగ!
చుట్టూ నల్లత్రాచులు!
కటికి చీకటి కోరలు!

ఆకొండ గమ్యంచేసి
నడిచి వస్తున్నామే!
కొండ తప్పుతున్నట్లుంది!
దారి అగాథంలో దిగిందే!

జాగ్రత! చిమ్మచీకటి!
ఎక్కడ టార్చిలైటు!
అటుపదండి కామ్రేడ్స్!
అప్పుడే చుక్క పొడిచింది!

మళ్ళీ ఆకామ్రేడ్స్ నాడి చూడండి!
నలుగురు క్షతగాత్రుల్ని మోయడానికి
ఎనమండుగురు చాలడంలేదా?
నెత్తురు ఇంకా ధారగా కారుతూనే వుందా !

జాగ్రత, నెత్తిమీదప్రమాదం!
అడుగడులో అపాయం!
దారి చెరగకుండా పదండి!
చుక్కల్ని గమనించండి!

ఇంటిదగ్గర అంతా కులాసా
రేపీపాటికి ఈ ప్రాంతం మనది
తెలీదా, నిన్న ఆరుపరగణాలు
మనవాళ్లు విముక్తి చేశారు!

ఇరుకులో తిరుగుతున్నందుకు
అడివి ఎంత దిగులుపడుతుందీ!
ఇబ్బందిలో దిగబడ్డందుకు
ఎంత మౌనంగా వాపోతుందీ!

కాకులు ఆడని కారడవే
చీమలుదూరని దండకారణ్యామే
ఎలా శత్రువులు ముట్టడించారు?
ఎవరో ద్రోహం చేసి వుంటారు!

సకాలంలో కొరియర్లు చేరకపోతే
వెంటనే జాగ్రత పడాల్సింది!
అయితే 'పందులు' కూడ నాలుగో
ఐదో నేల కరవ లేదంటారా!

జాగ్రత, అలికిడి పొడకడుతుంది
వేకువ గొంతు విప్పుతోంది
కష్టమనకుండా నడవండి కామ్రేడ్స్!
గమ్యం కాస్త దూరంలోనేవుంది!

వళ్లు పగిలిన పుండయిందా
కాళ్ళు నెత్తురు చారలయ్యాయా
తూలి నేలపడబోతున్నారేం—
కామ్రేడ్స్ ఎర్రజండా చిన్నబుచ్చుకోదా!

కామ్రేడ్స్!
తడబడకుండా నడవండి!
గమ్యం చేరండి, కాంక్షను సాధించండి!
ప్రపంచాన్ని వెలిగించే
పతాకను నిలబెట్టండి!

శిక్షాపత్రం

హెూ! ఎడారిలో సందడి
ఒహెూ! అడవిలో వెలుగు
పగవాడి నడుములిరిగినా
అడుగో నడిరాత్రిలో దాగి!
వేళ కాని వేళ చర్చిలో గంట!
కనుచూపుమేరలో ఏదోమంట!

అంతా జాగ్రత కామ్రేడ్స్!
కామ్రేడ్స్ అంతా గెట్ రడి!
....
భయంకాదులే అది నభం!
ప్రమాదం లేదులే ఆది దళం!

తీగ చప్పుడవగానే
ఏదో మృగం పొంచిదనుకున్నా!
ఆకాశం కన్నుమూయగానే
ఏదో కీడు దాడిచేసిం దనుకున్నా!
*　　　*　　　*

ఓ హెూహెూ! నీవా ద్రోహీ!
నాకోసం కళ్లు కాగడాలుచేసి
శోధిస్తావేం మానవ విద్రోహీ!
నీ రొమ్ముకాచుకొని, నీ నీడ
తొక్కుతూ, నీతోవస్తున్నానే!
నన్ను ప్రతి ఇల్లూ తల్లిలా
కడుపులో పెట్టుకొని కాపాడుతుందే!

ప్రతివృక్షం కన్నతండ్రిలా
ఆశ్రయమిచ్చి ఆదుకుంటుందే!
గుట్టలూ, పుట్టలూ, పొదలూ
తోబుట్టువులులా నీడ నిస్తున్నాయే!
అణువణువులో; ప్రతి కణంలో
అగ్ని కేతనంగా, కాంతిగీతంగా ప్రజ్వలిస్తున్నానే!
నా విశ్వరూపం సకల జీవకోటి వదనంపై
పవిత్రంగా ప్రతిఫలిస్తుందే!

అయితే నన్ను చూస్తావా,
నీ చుట్టూ పరిసరాల నడుగు
వివరంగా విపులీకరిస్తాయి

నీబూట్లు పాలిష్‌చేసే బాయి నడుగు
నికాళ్ళు పట్టే బానిసను బ్రతిమాలు
నీ కారు డ్రైవరు జేబులో ఉత్తరాలు చూడు
ఈ కాలిబాట ఎక్కడికెళ్ళుందో చూడు
కాపలావానిలో దాగిన కోరిక విను!

నా ఆచూకీ చాకలి నడుగు
నీకన్నం పెట్టే పరిచారిక నడుగు
నీవు నమ్ముకున్న కొడుకు నడుగు
నీవుంటున్న ఇంటి గోడనడుగు

నీచుట్టూ నిర్లిప్తంగా చూస్తున్న
చేతనాచేతనాల్ని ప్రార్థించు
మహాసముద్రంలా పొంగులువారే
జనతాహృదయాంతర్వాహిని లోతులు చూడు!

ఇంతెందుకు?
వాతావరణాన్ని బంధించి

161 అకలి, ఆగర్భ దరిద్రాన్ని
నిలవేస్తే సరిపోతుంది గదా!

అయితే దేశ ద్రోహీ!
నీకంటె నా కాప్తులెవరు?
అందుకనే నీతో బాటు
ఇరుకుల్లో, ఇదుమల్లో
వస్తున్నా, నివసిస్తున్నా!

నడిరాత్రి నిశాదేవతలా
నిన్ను అవేశిస్తున్నానే!
పదునైన బల్లెంలా
పక్కలో పడుకుంటున్నానే!
గాయంలో కోతలా
వెంటాడి వేధిస్తున్నానే!

అడగవేం??

" ఎందుకు చీకటి
తలచిక్కు దీస్తుందో?
ఎందుకు ఈ వట వృక్షం
వూడలు విస్తరిస్తున్నాయో!
నిశ్శబ్దం నిశ్శబ్దంతో
నిశ్శబ్దంగా చెపుతుందేమిటో"
చెప్పమని అడగవేం??

అయితే ఎలా చేస్తావు మరి?

నీతోడునీడలు గొడ్డళ్ళతో
నీవెన్ను పొడిచాయి దుష్టుడా!
మేరుగిరి ప్రమాణద్వేషరాసి కరిగి

నీచుట్టూ అగడ్తలు తీసింది ద్రోహీ!
సాయుధగెరిల్లా నివహాలు
నిన్నుముట్టడించాయి విద్రోహీ!
అగర్భ శత్రుకోటి నిన్ను
చుట్టుముట్టింది హంతకుడా!

జాగ్రత!
అడుగు ముందుకేశావా
ఆనవాలు దొరకవు!
పారిపోయుత్నించావా
నామరూపాలుండవు!

చెపుతున్నా విను!
వైతరణిలో కాలుజారుతుంది
అమాంతంగా పాతాళంలో పడిపోతావు
స్వయంకృతాపరాధంలో దిగజారిపోతావు!

నీకోసం
జనగామాలో దెబ్బతిన్న పులులు
నేలనాలుగు చెరుగులు గాలిస్తున్నయి!
నల్లమల అడవి
నల్లత్రాచులా కోరలు విప్పింది
నల్లగొండ జిల్లాలో
నీలోతుగోరీ సిద్ధంగా వుంది!

నీవు తెలంగాణాలో ఎక్కడి
కెళ్లినా బండి కట్టెలెదురౌతాయి
ఏతెలుగు తల్లి కెదురయినా
మైలుదూరం తొలిగి వెళ్తుంది

ఏ తండ్రి కంటబడినా
క్రోధంతో భగ్గున చూస్తాడు

నీవు నడిచిన బాట
పరిశుద్ధం చేస్తున్నారు!
నీవు చెప్పిన మాట
భాషకు బరువయింది!

ఇక్కడే ననుకుంటా
నీవు అమాయకుల
మట్టిపాలుచేసింది
ఉత్తమోత్తమ మానవులు
ఒక కంటితడి చూడకుండా
ఒక కంటబడకుండా మరణించింది
అందుకే అడివిచెట్లు
దావానలం కక్కుతున్నాయి
నెత్తురుమడుగులు
కత్తుల బావులయ్యాయి

ఇక్కడేకదా నీవు
త్రాగేనీళ్లలో విషంకలిపింది
నీళ్ళుత్రాగే నిరాయుధుల్ని కాల్చింది
నిద్రించే వీరుల్ని దారుణహత్య చేసింది
అందుకే ప్రకృతి పగబట్టింది
ఈదారి దొక్కావా ఇల్లు చేరవు
ఈగాలి పీల్చావా ఇవాళతో సరి

ఇక్కడే కదా
నీవు భాషాదేవిని చెరబట్టింది

గ్రంథాలయాలు చలిమంట లేసింది
ఏ కావ్య కంఠం ఫెల్లున పగిలిందో
ఏ గ్రంథం మృత్యువును కంఠస్థలినుంచిందో
శతకోటి రావణాసురుడి కాష్టాలు నీకోసం మండు
తున్నాయి
కోటికోట్ల మృత్యుహస్తాలునీకోసంవెదుకుతున్నాయి

* * * *

భయం,
భయానకంగా ఆవహించిన
పిరికివాడా!
కోపంకరిగి పురకలు పెట్టే
కృష్ణానది కెదురీదుతావా!
క్రోధం పెరిగి జాలువారిన
గోదావరి దాటుతావా!
పరాభవం దహించి
ప్రళయంలా విజృంభించిన
తెలుగుతల్లి కెదురు నడుస్తావా!
అవమానం కాటంది, అనియై,
భికరాగ్ని జ్వాలా హెూళిక కాళికగా
విజృంభించిన అవని కెదురు తిరుగుతావా!

అయితే రా ద్రోహీ!
అటో ఇటో తేల్చుకుందాం
నేటితో చీకటి సంహారం!

—★—

నిజంలో నిజం

నాకు తెలియక అడుగుతా
" నీకళ్లు జనకారి పోయా
ఎందుకో చెప్తావమ్మా? "

అది తెలియదా, నాయనా
" మలబారు పోలీసులు
ఒకనాడు కొడుకు జాడ
చెప్పమని కళ్ళు పొడిచారు! "

అయితే బాబూ,
" పోయిన శివరాత్రినాడు
కోటప్పకొండ నాతో ఎక్కావే!
ఇప్పుడు మూడుకాళ్ళ ముద్దవయావేం?"
ఏమని చెప్పను బాబూ,
" హింసాకాండకు తలదించకపోతే
పోలీసులు మోకాళ్లు కాల్చిపారేశారు! "

" అమ్మాయీ, పదహారేళ్ళు నిండీ
నిండని నీనోరు బోసికొడుతుందేం?"
" ఆరునెలల విచిత్రహింసలో పళ్లు
ఝల్లున రాలాయని వినలేదా! "

" అమ్మా, అబ్బాయి
ఎక్కడి కెళ్ళాడు? "
" ఇంకా వాడెక్కడ నాయనా
కొండంత కొడుకుని.........
క్రూరులు దిగమింగారు! "

" అమ్మాయీ, అతను
కనపడటం లేదేం? "
" ఇంకా ఆయనెక్కడ?
నల్లమల అడవిలో
పోలీసులు కాల్చేశారన్నా! "

" ఈవూరి దీపం
కొండెక్కిం దెప్పుడు? "
" నిరుడీ రోజున ముట్టడించి
వాళ్లు వూరు పాడుపెట్టారు! "

" ఏడుగోతులు ఇక్కడ
నెత్తురు కక్కుతున్నా ఎందుకు? "
" ఏడుసిలువల ఏడుగోతులలో
ఏడుగురు యోధులను కాల్చి
కాకులకు పారేసింది ప్రభుత్వం! "

" తొమ్మిది కొట్టిన నగరం
కళేబరంలా కదలదేం? "

" జనం కదిలితే అనుమానం—
అనుమానం హత్యకు మార్గం,
అందుకే నగరం, గ్రామం
హడిలిపోతున్నాయి భయంతో! "

బహిరంగ లేఖ

II

ఇవాళ,
చాల సుఖంగా, శుభంగా గడిపి
హాయిగా నిద్రించను తృప్తిగాతిని పడుకున్నా:
" నడిచి నడిచి కాళ్ళు విరిగి, తిండిలేక కళ్ళు గుంతలుపడి
అడవిచెట్లకింద కటికినేలమీద పరుండి నిద్రపట్టక
అటూ, ఇటూ, ఒకటే వ్యథతో పొర్లుతున్న మీమూర్తి
నాకళ్ళను కట్టింది!
లేచి చెమ్మగిలిన కళ్లనుండి అక్షరముత్యాలు తీసి
లేఖ కూరుస్తున్నా!"

ఉత్తరంమీద ఉత్తరం వ్రాయను,
సమాచారం సకాలంలో అందించను
అనుదినం అనుకూలించక పోయినా
నిత్యం చింతల చితిపై వేచుతున్న
మీ ఆప్తుల, ఆత్మీయుల ఆత్మవేదన
నివేదించను ఈ ఉత్తరం వ్రాస్తున్నా!

ఉపద్రవ ఉదంతాలు సన్నగా స్రవిస్తున్న జలధరాలు
మిత్రుల విద్రోహంతో ఆయువు పట్టు అలుముకుంటున్న కార్చిచ్చు,
పగలు రాత్రుల మధ్యనున్న సరిహద్దును చెరుపుతున్న కాళికహస్తం,
కొండలు, గుట్టలు కరిగిస్తున్న అనాగరిక మానవ రక్తమహానదులు—
నలువైపులనన్ను కుతకుత ఉడికించగా, భగభగ జ్వలియించగా,

అగ్నిద్రవంగా, లావాగా ఘనీభవించి ఉత్తరంలో సాక్షాత్కరిస్తున్నా!

సాధారణ సిరాతో, సామాన్య కలంతో మీకు ఉత్తరం వ్రాయడం—
మిమ్మల అగౌరవ పరచడం, అపచారం చేయడం అవుతుంది
అందుకనే పిడికిలితో నాగుండెపిండి సలసలమరిగే ఎర్రసిరా తెశాను!
చూపుడు వేలునరికి చరిత్రచూడని, చూడబోని ఉత్తరం ఉపక్రమించాను!

*　　　*　　　*

పుట్టలలో నక్కి ఉన్న నల్లత్రాచు పాములు
చెట్టుచాటున కోరలు విప్పన క్రూరమృగములు
కయ్యాలలో ఒడిగి పసిగడుతున్న అడవి పందులు
నదీగర్భంలో కుట్రపన్నుతున్న భారీమొసళ్ళు
కాలిదారులలో మస్తుగ పూడ్చిన ప్రేలుడు మందు ముద్దలు—
నాతోడు నీడలార, కనిపెట్టి కాలు ముందుకు పెట్టండి!

ఈరోజున శ్రమించకుండా ఆహారపదార్థాలు అపరిచితులందించనువచ్చారు
అనుకోకుండా నీటిమడుగుల జాడలు పుష్కలంగా తెలియవస్తున్నాయి
వార్తలు చేరవేయను, వార్తలు తీసికెళ్ళను, ఎవరోవార్తావహులు వచ్చారు
వీటికి కారణం, వీరి పుట్టుపూర్వోత్తరాలు వెంటనే అవగతంచేసుకోండి!

ఇచట కపోతం వంటరిగా కంటతడిపెట్టి వినిపిస్తుందెందుకో?
ఎవరో బాకుతో వెన్ను కుమ్మినట్లు అడవి విలవిల కొట్టుకుంటుందేం?
హఠాత్తుగా వేటగాళ్ళ పుట్ట పగిలినట్లు లేళ్ళమందలు పారిపోతున్నాయేం?
చెట్లు, చేమలు, నిశ్శబ్దంగా ఏదో ప్రమాదాన్ని పసికడుతున్నాయెందుకో?

కడలి ఒడలును తుపానువ్యాధి తీవ్రంగా వ్యాపిస్తోంది!
అడవి ఎదను కిరాతకులు పొంచి గురిపెట్టారు
ఇంకా మీ రక్షణప్రాంతం దుష్టుల దృక్కులకు తాకలేదు
నా సఖులార, సశేషసమాచారం విని ప్రతిఘటనకు క్రమించండి!

మురళీ,

నీ వెళ్ళేప్పుడు చీరకట్టిన మీ చెల్లాయి
ఇప్పుడు ఒక ఇల్లాలై పాపకు పాలు పెట్టుకుంటోంది
మీనాన్న నీవుపోయిన మరునాడే కుప్పకూలినట్లు క్రుంగి,
మంచుకొండ వంటి దిగులు ఆవహించి మంచం పట్టాడు!
మీ అమ్మ నీ చిట్టి కొడుకుకు నీ పేరు పెట్టుకుని
నిన్ను మరిచిపోవడానికి నిరంతరం తపస్సు చేస్తోంది!
నీకు అండగా, గుండె కండగా వుండడానికి వచ్చిన
నీస్వప్నమూర్తి భార్య నిన్ను క్షేమంగా కలిసిందనుకుంటా!

పున్నయ్యా,

మీ మల్లెతోట ఆరపోసిన పిండిలా పుష్పించింది
ఎల్లకోడె ఏరువాకనాడు అకాలంగా చచ్చిపోయింది
కుంటచేను ఉగాదినాడు అప్పులవాళ్ళు కట్టుకపోయారు
మీ పెద్దమ్మాయి పరికిణీ కట్టుకుని బడికెళ్తావుంది
చంటాడు ఇప్పుడిప్పుడే మాటల్లో పడుతున్నాడు
మీవూళ్లో గ్రంథాలయానికి పదోతేదీ ప్రారంభోత్సవం చేశారు
మీ ఆవిడ నీదిగులుతో ఆస్పత్రిలో చేరి ఆరునెలలయింది
మీ పెంపుడమ్మ తలమాత్రం ముగ్గుబుట్టలా అయిపోయింది!

సుబ్బారావు,

మీ అన్నదమ్ములు మొన్ననే ఏర్లుపడ్డారు
భాగపంపిణీలలో, జోరుగా తగాదాలు కొట్లాటలు జరిగాయి
మీతమ్ముడు ప్లీడరీ ప్యాసయి బస్తీలో ప్రాక్టీసు పెట్టాడు
మీ మామిడి తోట కొద్దికొద్దిగా కాపుకు వస్తూవుంది
నీ ముద్దుల 'టైగర్' ఒకస్మాత్తుగా ఒకటోతేదీ చనిపోయింది
మీదొడ్లో గులాబి మొక్కలు కొల్లగా పూలు పూస్తున్నాయి

మీ పక్కింటి అమ్మాయిని ప్రేమించిన 'ఆతను' మోసం చేశాడు !
ఏనాడి క్రిష్టి శశిరేఖవేషం బహు భేషుగ్గా వేస్తూవుంది !

సరోజనీ,

ఎల్లా అడవుల్లో అష్టకష్టాల నట్టింట్లో కాపరం చేస్తున్నావమ్మా
దినగండాలు అవలీలగా దాటుతున్న, నీముందు తలొంచుతున్నా!
నీపసిగుడ్డు కాస్త నీవుపోయిన పదోనాడు కళ్ళుమూసింది
మీభార్యాభర్తలిద్దరూ ఒకదళంలోనే వుంటూవున్నారా !
మీ చెల్లి యం. బి. ప్యాసై కిస్మసులో గొప్పగా పెళ్ళిచేసుకుంది
మీ మరిది అతని కథల పుస్తకం నీ కంకితం చేశాడు
ఈ మధ్య నీపేరుతో మనవీధిని నామకరణం చేశాము
ప్రతిరోజూ మనవూళ్ళో నిన్ను అనుకోని ఇల్లులేదు!

రామారావు,

సరిగ్గా ఏడాదినాడు మీ ఇల్లు యం. యస్. పి. నేల మట్టం చేసింది
మీ తమ్ముణ్ణి 'వాళ్ల అరుగుర్ని' తీసికెళ్ళి కొండబోటువద్ద కాల్చేశారు
పదిసార్లు మీనాన్నను పదిమందిలోకీడ్చి పచ్చడిగా చిత్రహింసచేశారు
నీభార్యను నడివూళ్ళో చెప్పగూడని అవమానానికి గురిచేశారు
మీబావతో బయలుదేరి పారిపోతున్న మీ అక్కయ్యనెత్తుకెళ్ళారు
మీవూళ్ళోవాళ్లందర్ని వందసార్లు ఒకచోటచేర్చి చావచితకకొట్టారు
మీవూరి వీధుల్లో నెత్తురుమరకలు ఇంకా ఆరలేదు !
కుదురుగా కూర్చుని ఇంకా ఎవరూ వంట చేసుకోవటంలేదు!

మోషే,

మొన్న గూడెంలో నిప్పుపడ్డప్పుడు అన్ని గుడిసెలతోపాటు
మీగుడిసెకూడ ఆనవాలులేకుండా అదృశ్యమయింది
మీ వీధి రత్తి వీరిగాడితో పోయిననెల లేచిపోయింది
మీ ఇంటిముందు మురుగుకుంట చాలా విస్తృతమయింది

మీ బావమరది బొంబాయి బట్టల మిల్లులో కూలిపని చేస్తున్నాడు
మీ మరదల్ని జనవరిలో వజ్రానికిచ్చి పెళ్ళిచేశారు
నీ ముగ్గురు బిడ్డల్ని పోషించలేక మీ ఆవిడ నానా అగచాట్లుపడుతోంది
మీ అమ్మ కన్నీళ్ళకడవయి ఏసుక్రీస్తు శిలువ తడుపుతూ ఉంది!

వెంకట్రామయ్యా,
మీ వందెకరాలపొలం దిక్కులేక బీడుపడ్డది
భయంతో పగలెవరూ మనుషులు మీవూళ్ళో వుండటంలేదు
మీ ఇంట్లో మలబారుపోలీసులు జబర్దస్తీగా క్యాంపుపెట్టారు
రామిని, కాంతమ్మను దౌర్జన్యంగా వాళ్ళు వుంచుకుంటున్నారు
మునసబును నడిబజారులో నెత్తురు కక్కిందాకా కొట్టారు
పగతో మీవూరి ఒకే ఒక మంచినీళ్ళబావిని 'వాళ్లు' పూడ్చేశారు
ఇవాళ మీవూళ్ళో మందుకైనా ఒకకోడి దొరకదు
చూద్దామన్నా, అందమైన అమ్మాయి, అణాడబ్బులు కనపడవు (రు)!

ప్రసాద్,
నీ కళ్లజబ్బు పూర్తిగా నయమయినట్లేనా!
మొన్న ప్రిన్సిపాలు నీక్షేమసమాచారాలడిగితే నవ్వొచ్చింది
చిక్కన మీతమ్ముణ్ణీ, చినబాబును దొంగచింత దగ్గర కాల్చిపారేశారు
నీ " మెరుపుదాడుల్ని" వూళ్ళూ వూళ్లూ గాథలుగా చెప్పుకుంటున్నాయి
ఈ ప్రాంతపు 'దోపిడీ జలగలు' చల్లగా బస్తీలు జారుకుంటున్నాయి
మీ ఆస్తి గత సంవత్సరం ఈరోజే ప్రభుత్వం స్వాధీనపరుచుకుంది
ఇంకా 'ఆదినారాయణ ముఠా' బాహాటంగా సి. ఐ. డి వృత్తి చేస్తూంది
మరిచిపోయా, తుపాకి గుళ్ళు దూరిన నీమోకాలు ఎలావుంది!

శాంతమ్మా,
నీకు శూలనొప్పి ఏమయినా కాస్త నెమ్మదించిందా!
గుండ్రాతి మడుగుదగ్గర నిన్ను కాల్చి చంపారనే ప్రచారం అబద్ధంకదూ

పచ్చిపసుపుకొమ్మువంటి నీముఖం కొరివిలా వికృతమయిందటకదా!
నీ భర్తను పొట్టపెట్టుకున్న కిరాతక సబినస్పెక్టర్ని బళ్లారి బదిలీచేశారు
మీ అమ్మాయి కొత్తకొత్త ముగ్గులు పెడుతూ కులాసాగావుంది
మీ మామగారి కౌలుపొలం ఈ యేడు పిచ్చిపంటపండింది
మీ చిన్నన్నయ్య, రంగనాయకులుగారింట్లో పాలేరుగా కుదిరాడు
మీఅమ్మ అరిసెలమూట పంపించింది, నీకు భద్రంగా అందిందా!

మస్తాను భాయీ,

రంజాను పండగనాడు మీయింటి కెళ్ళివచ్చాను
పండగనాడుకూడా ఫలావుచేసుకోకుండా మీవాళ్లు ఎంతోభారంగావున్నారు
మీ బాబు రోజూ మసీదుకెళ్లి నీక్షేమంకోసం ప్రార్ధనలు చేస్తున్నాడు
మీ కరింబీ, వంటిమీదనగలు, చెవులపోగులు చుప్తాగా అమ్మివేసింది
మీ పిట్టి అషాబీబీ, ఖురాను గీతాలు మధుర మధురంగా పాడుతూంది
మీ చెల్లి జోరా ఉర్దూబడిలో ఉపాధ్యాయినిగా చేరి చాలకాలమయింది
నీలేమితోపాటు కటిక దరిద్రం, మీసంసారం ఎముకలు కొరుకుతోంది
మీగుమ్మం కాచే జనపనార పరదా చిరిగి పీలికలయి జారిపోయింది!

శాంతి పర్వము

12A

728

౧౬

చైనా!

మా జననీ! అజేయజనచైనా!
విజయం వెన్నెలగా వెదజల్లే నవచైనా!!
జోహారులు! జోహారులు! జనచైనా!!

కనలిన తీయని తలపులు
మళ్ళీకొత్త చిగుళ్ళు తొడిగాయా?
అరిగిచెరిగిన అదృష్టరేఖలు
మళ్ళీ స్పష్టంగా విప్పారాయా?

మాసిపోయిన మాచరిత్రలు
నీతికి గనులై వెలిశాయా?
చెదిరిన ఆశాలతలు
తిగసాగి అల్లుకున్నాయా?

ఆకలి అనుంగుబిడ్డల మమ్మా!
ప్రతీకారాగ్నుల పాపలమమ్మా!
బరిపై ఒరిగే వీరులమమ్మా!
శత్రుగుండెలపై తుంపటులమమ్మా!

ఏనాడో ఇంకిన జీవన కాసారాలు
మళ్ళీ హర్షవర్షాలతో పొంగులు వారాయా?
ఆకలితో ఆరిన దీపాలన్నీ
ఏకంగా ధగధగ వెలిగాయా?

మళ్ళీమన జైత్రయాత్రలో
మరోజయస్తంభం నిలిచిందా?
మహా విజయ పతాకం ఎగిరిందా?
గమ్యం కనుచూపుమేర చేరామా?

దరిద్రజీవులంతా కోరి
అభిమాన ధనులంతా చేరి
ఇచ్చే ఈ విప్లవ హారతులు
ఆప్యాయంగా అందుకోవమ్మా !

కడుపు కాలు కర్షకులం,
కూడులేని కార్మికులం,
నిరాధారులం, నిరుద్యోగులం,
ఆశతో గమ్యం చూసేవాళ్ళం!

ఓ విముక్త ప్రజాచైనా!
ఓ విప్లవమూర్తి చైనా!
ఇవే పీడిత ప్రజ జేజేలు!
ఇవే కోటికంఠ జయధ్వానాలు!

ఓ చైనా పేదరైతులారా!
దురాక్రమణ భూములన్నీ
మహాక్రమణ చేస్తున్నారా!

"మళ్ళా మాచేలన్నీ
మాకిచ్చేస్తున్నారా!
మాజీవిత కష్టార్జితం
లెక్క అప్పగిస్తున్నారా!

మళ్ళీ మా పందెపుకోడె
ఖణీల్మని రంకేస్తుందా!
మళ్ళీ మాదుక్కిటెద్దు మెళ్ళో
గంట ఖంగున మ్రోగుతుందా!"

ఓ విముక్త ప్రజాసైనికులారా !
లోక లోకాల జయగీతం విన్నారా !
శ్రామిక లోకపు నివాళులందారా !

కామ్రేడ్‌మావ్! కామ్రేడ్ ఛూటే!
అడుగడుగున మీనామం జపిస్తాం!
ఇంటింటా మీ పేరుతో దీపం పెడతాం!
ఊరూరా ఇవాళ పండుగ జేస్తాం !

జనచైనా! జగదభివందనాలివిగో చైనా!
నీస్వేదంతో వెలిగే చైతన్య జ్వాలలం!
కళ్ళారాచూడు, నీ అనుగు తమ్ముళ్ళం !

మీ ఆదేశం అందుకుని పురోగమిస్తాం!
ఉడుకుతున్న గుండెల కండలతో
ఉర్వీతలమంతా విముక్తి చేస్తాం !

శాంతి గీతం

ఇపుడే, ఇపుడిపుడే వడివడిగా వస్తున్నా!
పలుఇడుమల మడుగులు దాటొస్తున్నా!
పది సముద్రాల దుఃఖం తోడుకవస్తున్నా!
దరిద్రప్రజానీక దుర్భర భారం మోసుకవస్తున్నా!
పీడిత జనతాజగత్ ప్రసవవేదన రికార్డులు తీసుకొస్తున్నా!
పత్రికలు, ప్రభుత్వాలు తొక్కిపట్టినవార్తలు తవ్వితలకెత్తుకొస్తున్నా!
అంతా పచ్చనిలోకం! అంతా నాచరిత్ర అవధరించండి!

కాళరాత్రి నేత్రంలో నానీడ కనపడకపోయినా—
కాళ్ళచుట్టూ సుడిగుండాలు మెలికలు తిరిగినా
కనుచూపుమేరలో ఎక్కడా ఆశ అంకురించకపోయినా
పీడకధాత్రీ హస్తం అడుగుసాగనీయక అడ్డుపడినా
నన్ను ఆహ్వానించే ఎర్రపూలు పుటుక్కున తునిగిపోతున్నా
విపత్తులు కమ్మిన నభం భయానకంగా ఉరుముతున్నా
అలానే సప్తసముద్రాలు అష్టకష్టాలమీద అధిగమించా!

కాలినడక సాగిద్దామని సన్నాహం చేయగా
అడుగడుగునా కాలికిందనేల తొలిచేప్రమాదాల సందడి!
పడవలో ప్రయాణిద్దామని తీరా బయలుదేరగా,
సముద్రాలనిండా గుప్తపరిచిన మందు గుండు గిడ్డంగులమూల్లు!
ఆకాశ యానం చేయను అంతా హడావిడిగా సిద్ధపరిస్తే
అపాయాలలా అగ్నిగోళాలు ఆకాశం అల్లుకుంటున్నవయినం!
ఏడ్పులు, పెడబొబ్బలు, బాధావేదన హాహాకారాలతో
వాతావరణం నిబిడమై కాలం తాపేలులా జరుగుతోంది

అయినా పచ్చిగాయంలా, భీభత్స స్వరూపంలా సాక్షాత్కరించిన
భూగోళచరిత్ర పరిశీలించను ప్రాణం ఊతంచేసుకొని ప్రయాణంచేశా !

భూగోళ హృదంతర కురుక్షేత్రకేంద్రంలో
రెండు విరుద్ధజండాలు, విభిన్న సిద్ధాంతాలు సంఘర్షిస్తున్నాయి
అనాదినుండీ ఎదిగే ఈ ప్రచండశక్తులు చరమాకంలో అడుగెట్టాయి
సమాధానం సంభవం, కాని అధికారంలో ఉన్న రజతఛత్రం
ఇపుడే ఉద్భవించిన మానవుడి ఆత్మను, అంతరాత్మను కాలరాసింది!
మారణహోమంలో చైతన్య మానవాళిని ఛిద్రం, భస్మంచేసి
క్రుంగే సింహాసనాన్ని సుస్థిరంచేయను యుద్ధపతాకనెత్తింది!
కలకాలం కలవాళ్ల కాడిమోయలేక, కాలకూట విషజీవితం సేవింపలేక
సకలకార్మిక కర్షకజన సందోహం హర్షంతో శాంతిపతాక ప్రతిష్ఠించింది!
" నాపేరు యుద్ధం, మృత్యువు నామారుపేరు, విధ్వంసం నాగమ్యం!"

" మళ్ళీ వచ్చావా తల్లీ, బొమికల గూళ్లు మాబిడ్డల
నెత్తురుపిండను, మా గుడిసెలు నేలపాలుచేయను,
మా పస్తుల బ్రతుకులు ధ్వంసం చేయను,
మా ఆస్తి గుంపెడు బిడ్డలు, బండెడు అందని ఆశాఫలాలు,
అర్థాకలి, ఆగర్భ దరిద్రం, మా పిత్రార్జితం—ఈ బ్రతుకుకే
కన్నుకుట్టి మా తలుపుకూడ తట్టావమ్మా ! "

" కూలిన ఇల్లు బాగైనా కాలేదు, విరిగిన కొడుకు కాలు కట్టుక్లోలేదు
బాంబులుపడి శ్మశానమైన గ్రామం పూర్తిగా కోలుకోలేదు
కరువులో బీడుపడ్డ పొలాలు, యుద్ధంమూలాన పట్టిపోయిన
భూములు తిప్పుకోలేదప్పుడే గజ్జలు కట్టుకవచ్చావమ్మా! "

"కాలు జారిజారి బ్రతుకు బొప్పికట్టినా పరుపుకుప్రాకులాడటం మానలేదు
నిక్షేపాలు పెల్లగించి నిరుద్యోగరాకసికి ఉద్వాసంచెప్పాలని ఉద్యమించాను

తెరలు తెరలుగా శూన్యంతప్ప ఎక్కడా తేజఃపుంజం దృక్కుకు తాకడం లేదు
ఇంతలో అగాధనిశీథ హృదయంగా నన్ను చేయెత్తి పిలిచావమ్మా! '

" రెండోయుద్ధపు రక్కసి దేశదేశ అంతస్సులో మలిచిన గాయాలు మానలేదు
బాంబర్ విమానాల విజృంభణకోలాహలం చెవుల మార్మోగుతోంది!
వినాశం ఎగజిమ్మిన దట్టమైన పొగమబ్బులు విడివడలేదు
రెండుచేతుల్తో ఆటంబాంబుల బంతులు ఎగరేస్తూ వచ్చావమ్మా! "

" ఎందుకు లాభాల సంచులు తెచ్చే యుద్ధాలు బహిష్కరిస్తాం?
ఎందుకు మావినాశం పట్టుకొచ్చే శాంతిని స్వీకరిస్తాం? "

" నిష్క్రమించే కాళరాత్రి కాళికగొంతుక కాదుగదా?
నిర్గమించే పీడకలల తుదిగలగల కాదుగదా ఇది! "

" అపుడే దోపిడీవర్గ ప్రశ్నకు గుండెలు స్తంభించిన లోకప్రజా,
సత్వర సమాధానం గుండెల ఆకురాతిమీద సానదీయండి! "

" మళ్ళీ యుద్ధం తెస్తారా! విధ్వంసంలో ఇల్లు కట్టుకోమంటారా?
ముందు నుయ్యా, వెనుక గొయ్యా త్రవ్వి పద్మవ్యూహంలో బంధిస్తారా?"

"తల్లీ, నీచల్లని స్తన్యంకోసం
రొమ్ము తడిమే చనుపాపకు
ఏదోవ చూపెదవమ్మా!

చిత్ర నిద్రాసీమలలో విహరించే
ప్రియునకు ఈవిషవార్త ఏచేతులతో
అందజేసెదవు అక్కా !

ఎప్పుడూ జడివానగా పడే కడగళ్లవడగళ్ళతో
నడుమువిరిగిన మానవుడా! భయంకర
నరకంగా భావి నోరు తెరిచి పైకి దూకుతోందిరా!

అనుక్షణం జీవన వెన్నెలతీరంలో నిరీక్షించే
జవరాలా! నీ నిర్మల నిరీక్షణ ఆవరణలో
అపాయం హఠాత్తుగా ప్రేలెనమ్మా!"

"నీమేలిముసుగు భద్రతకే
ముప్పువచ్చెనమ్మా!
నీ తలపాగ నేల తాకుకాలం
ఆసన్న మాయెనయ్యా!
ఎదిగే మధురమధుర స్వప్నకుసుమం
మన్నుకలిసెనమ్మా!
నీ బ్రతుకు నీడ వటవృక్షం

మొదలంటా నరికారయ్యా!
నీకళ్లముందు నీబిడ్డ ఎగరేసి
ముక్కలుముక్కలు చేశారమ్మా!
నీ చేతులు, నీ కాళ్లను తెగనరకను
గండ్రగొడ్డ లెత్తాయయ్యా!"

"చూస్తారేం, ఆపదల సాగరం అపుడే చెలియలికట్ట తెంచిందే!
భీకరవినాశం దావానలప్రవాహంలా ముంచుకొస్తుందేం?
అమృతం తొణికే సరస్సులనిండా గరళం నురుగులు కక్కుతుందేం?
చిమ్మచీకటివదనంపై మృత్యువు చేదుగా నర్తిస్తుందేం?
ఇంకెన్నాళ్ళు మోకాళ్ళపై నడుస్తూ బ్రతుకుతారు?
కటకటాల లోహపంజరం కన్నీళ్ళతో కరిగిస్తారు?

అకలి, అవమానం, అశాంతిలో సుళ్లుతిరిగి కళ్ళు మూస్తారు?
తుపాకిగుళ్ళకు నిండు గుండెల అడ్డుకట్టలేస్తారు?

ఆలోచిస్తారేం, అటంబాంబులు మోసే ఆకాశవిమానం చూశారా!
నిప్పులుకక్కే నెత్తుటిచేతుల హంతకచక్రవర్తుల శ్రేణులివిగో!
పిడికెడు ధనానికి ఆత్మలు అమ్ముకున్న షండులగుంపు లివిగో!
కడివెడు రూపాయలకు దేశం తెగనమ్మిన విద్రోహుల ముఠా ఇదిగో!

ఆలస్యం చేస్తారేం, కొరియాలో మీ భ్రాతల గొంతులు తరిగేదెవరు?
మలయా, తెలంగాణాలో మీ బిడ్డల గోరీవరుసలు త్రవ్వేదెవరు?
ఫార్మోజా, వీట్నాం విజయవాడ వీధులలో ప్రాణాల్ బలివిసరేదేవీరులు!

"కరకరపాడిచే నవ్యమానవాళి తొలిహెచ్చరిక కాదుగదా!
చరచర సంచరించే ఒకమహాశక్తి విలయవీచిక కాదుగదా ఇది!"

"నాపేరు శాంతి, మృత్యువు వాశత్రువు, అనన్తశాంతి నాగమ్యం స్థానం!
యుద్ధ వ్యాఘ్రాల సంహారయాత్ర నాజీవసమహాప్రస్థానం!
పచ్చని జీవితం తొణికే ప్రపంచ సంరక్షణ నాబాధ్యత!
నేను శాంతిబావుటా! కోటికోట్ల పీడితజనతాహృది ప్రతిబింబం!

"రమ్మతల్లీ! రారమ్మ మాకల్పవల్లీ!
రమ్మ మాకన్నతల్లీ! రారమ్మ మాకామధేనువా!
నీకోసం బ్రతుకంతా పడిగాపులు కాశామమ్మా!
నీకోసం భూగోళం కళ్ళద్దాలుచేసి శోధించామమ్మా!
నీవు అరిచేతిలో దాచిన భూస్వర్గం కోసం వేచామమ్మా!
నీవు కడుపులో పెట్టి కాపాడే ప్రపంచం ఆశించామమ్మా!"

"జీవితాన్ని ప్రేమించే మానవులారా! మానవలోక నేత్రాల్లారా!
హుటాహుటిగా శాంతి మందిర ప్రాంగణం ప్రవేశించండి!

అంతా 'శాంతిగీతం' భూనభోంతరాళాలు ప్రతిధ్వానం చేసేట్లు పాడండి!
యుద్ధోన్మాదులు ఒక్కుమ్మడి వెర్రికేకవేసిశ్మశానంలోతలదాచుకుంటారు!'

శాంతి నీకు, శాంతి నాకు, శాంతి శాంతి
ఇప్పుడే పుడమిమీద పడ్డ శిశుపసిగందుకు శాంతి
భార్య రొమ్ముపై తలనిడి నిద్రించే భర్తకు ప్రశాంతి!

రాలే నక్షత్రాలకు, కూలేయోధులకు శాంతి!
మండే గుండెలకు, మంటల మహాకవితకు శాంతి!
పొంగిన ఉదధులకు, పొంగెత్తిన ప్రళయాలకు శాంతి!
అవమానం దహించే సీతా, ద్రౌపదులకు, బలిపీఠంచేరిన ఆత్మలకుశాంతి!

దున్నలేక మొండికేసిన దుక్కిటెద్దుకూ, బడుగురైతుకూ శాంతి!
కాళ్ళకింద నలిగే చీమలకు, కాళ్ళుకాలే జనావళికి శాంతి!
పండితలలొంచిన పంటలకు, ప్రమోదాలకు ప్రశాంత శాంతి!
మహానగరాలకు, మహెూన్నత చిత్రశిల్ప సౌందర్యశిఖరాలకు శాంతి!

పాముకోటిలో సంకులసమరం సాగించే కప్పకు శాంతి
కాలిలో ముల్లునాటి విలపించే అడవిలో లేడిపిల్లకు శాంతి
ఎంగిలి ఆకులకై కుక్కలు, పందులతో పోట్లాడే తోబుట్టువుకు శాంతి
కన్నబిడ్డను చేతులార సాంఘిక దౌష్ట్యానికి బలిచేసే వితంతువుకు శాంతి

బజారులో ఆల్లాను ముద్దుగా ఆడుకునే అమాయక పసిబిడ్డలకు శాంతి
ఇసుకతో మేడలు, మిద్దెలు కట్టుతున్న పాలుకారు పసిపాపలకు శాంతి
ఇవాళనే చీరకట్టిన ఆడపిల్లల నవోన్మేషభవిష్యానికి శాంతి
ప్రసవవేదనతో తల్లడిల్లే తొలిచూలు ఇల్లాలికి శాంతి

చెల్లీ! నీ పసిపాపచిరునవ్వుకు శాంతి!
నీవదనంపై తొణికే వెన్నెల వెలుగుకు సుస్థిర శాంతి!

నీవూహించిన ఆశా సౌధాలకు శాంతి!
నీ పసిడి పసుపు, కుంకుమలకు శాంతి!

నీయెదలో మెదిలే, నామదిలో కదిలే భావపరంపరకు శాంతి!
నీవు పోగుచేసుకున్న ఆశారాసులకు, ఆకాంక్షలకు శాంతి!
నే కలలుగన్న లోకాలకు, కవితా వినువీధులకు శాంతి!
నీవు పుట్టిన గడ్డకు, నే మెట్టిన క్షేత్రాలకు ప్రశాంత శాంతి!

మరుగుదొడ్డి, మురుగురోడ్డు వూడ్చే పాకీ పని మనిషీ,
జనరల్ ఆస్పత్రిలో దుర్భరదుర్గంధంకాళనచేసే నరుసూ,
పాతాళంలో బొగ్గుగనులు పరిశోధించే కార్మికుడా!
హతమైన పోతుపక్షికోసం వాపోయే పెంటికపోతమా!
అన్యాయంగా అధికారంనోటిలో తలచిక్కుకున్న అభాగ్యుడా!
శాంతి శాంతి శాంతి మీకు ప్రశాంత నిరంతర శాంతి!!

ఎముకలునమిలే కష్టాలకు తలఒగ్గి నిరంకుశప్రభుత్వ సిబ్బందిలోచేరే
దరిద్రుడా!

సమాజకారాగారంలోపడ్డ చిత్రహింసకు పరాజితుడవై ఆత్మహత్యకు
ఒడిగట్టిన దీనుడా!

కడుపు చేతపట్టుకొని శిల్పం, శాస్త్రం, కళలు, కవనం పాలకజాతుల
కమ్మే మూర్ఖుడా!

మిసమిసలాడే కండలు,గుండెలుపెరికి నవసమాజం నిర్మించే
ఆదర్శజీవీ!

శాంతి శాంతి శాంతి మీకూ, మీరు ప్రేమించిన సమస్తానికి శాంతి!

కళ్ళు చెమ్మగిలిన, నిత్యనూతనశోభా, సంపదకిరీటధారిణీ! ప్రకృతి దేవీ!
కనకం పొదిగే, కాంతులు విరిజిమ్మే సుక్షేత్ర ముత్తైదువా,
ఇపుడే మూడుముళ్ళుపడ్డ, గడగడ కంపించే పెళ్ళిబిడ్డలూ,

ఆత్మబలిపీఠంపై జీవితాదర్శవిజయలక్ష్మిని ముద్దాడే విప్లవమూర్తీ,
శాంతి శాంతి మీకూ, మీ సువిశాల దూరదర్శిని యంత్ర నేత్ర
యుగ్మానికి శాంతి !!

దుస్సహజీవితం నేర్పిన మోసవృత్తితో బ్రతికేసఖుడా!
పరిస్థితులమూసలో మరిగి తయారైన గజదొంగమిత్రమా!
ఆకలితో వేగలేక మానం మార్కెట్టులో బేరంపెట్టిన సహోదరీ!
జీవితం ప్రేమించి, జీవితం లోకకళ్యాణనిమిత్తం త్యాగంచేసే వీరుడా!
శాంతి శాంతి శాంతి మీకూ, మిముగన్న తల్లులకు శాంతి!

తల్లిలేని పిల్లలూ, తల్లులు త్యజించిన బిడ్డలూ,
ఆకలితోతల్లడిల్లే పాపలూ, దిక్కులేని పక్కులూ,
పార్కు చెట్లకింద రోడ్డుపక్క మీద పవళించే దీనులూ,
శాంతి శాంతి శాంతి మీకు, మిముకని పారవేసిన భూదేవికి శాంతి!

శాంతి శాంతి శాంతి లోకగీతం శాంతి!
శాంతి శాంతి శాంతి లోకకంఠం శాంతి!
శాంతి శాంతి శాంతి బ్రతుకుబాట శాంతి!
శాంతి శాంతి శాంతి మన గమ్యం శాంతి !!

బేబీ!

బేబీ,
పాపం, కోపం,
ఎరగని బేబీ!
ఎర్రని ఆశీస్సు!

ఇప్పుడే మాకు తెలియని లోకాలనుంచి
మేము కలలుగన్న లోకంవచ్చిన
బేబీ! నీకుస్వాగతం!!

నీరాకతో
తూరుపు ఎర్రగా కందింది!
వర్గరహిత సమాజపు
నవోత్తేజంలో స్నానమాడు!

నీకోసం
పోలీసులు, ప్రభుత్వంలేని
కొత్త ప్రపంచం సృష్టిస్తాము!
తీయని మాట పలుకు!

నిన్ను చూసి
మృత్యువు, కన్నీరు
లేని లోకం తెచ్చాము!
లేచి పాలు త్రాగు!!

—✶—

అమ్మా!

అమ్మా!
జగత్తుకు అక్షరాభ్యాసం చేసిన అమ్మా!
రెండువందల కోట్ల మానవులను కన్న తల్లీ!
కష్టం, కన్నీరు ఈలోకంనుండి తుడిచేసే అమ్మా!
కలకాలం చల్లగా, ప్రశాంత సముద్రంగా వర్ధిల్లు!!

సకలప్రాణికోటి జననంతో కడుపుపండిన అమ్మా!
సృష్టితప్ప మృత్యువు ఎరగని చల్లని చేతుల తల్లీ!
కొండెక్కేదీపం చూసి మనస్సు తల్లడిల్లే అమ్మా!
తరతరాలుశాంతిగా, మాజ్ఞానకాంతిగా జీవించు!!

పురాచరిత్రకు, నేటి మానవాళికి ప్రేమతో
చేయిపట్టి నడక నేర్పిన జగజ్జననీ!
అనేక జాతులకు; అనేక భాషలలో
సమగ్ర సంగీత సాహిత్యాలు నేర్పిన తల్లీ!

ఓర్పులో భూదేవిని మించిన తల్లీ!
అద్వితీయ అనంత ప్రేమమూర్తీ!
అసూయ, అసహనం, ప్రేల్చెవిననేరని తల్లీ!
అపూర్వ చైతన్య స్రవంతి నమస్కృతు లివిగో!!

అమ్మా! విశాలవిశ్వమానవహృదయా!
చీకటిపై తిరుగుబాటు చేసిన తేజస్వినీ!
వినాశంలో విమల ప్రేమను సృష్టించే తల్లీ !
నేల నాల్గు చెరగులలో నిండిన, ఆశలు పండిన
మా అభివందనాలు !!



87

UDAYANI
(SELECTED POEMS)
by
GANGINENI

Check List

Book Number	NPROIA410	Date	27/03/23
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CI, 87		
Missing Pages	NO		
Prepared By	chaitu	Cutting By	chaitu
Scanned By	Deviravitha	Pages	115
Quality Checking	prathyusha		